


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 294 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 30 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 294 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 30 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వినియోగించుకోవడం లేదు

- శ్రీశైలం ప్రాజెక్టులో 71 శాతం వరకు నీటి నిల్వలు ఉన్నాయన్న కాకాణి
- సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్న
- నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన

- మిగతా 2లో




## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు



- అల్లూరి జిల్లాలో ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమం అమలుకు నిర్ణయం
- మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం సెల్ టవర్ల ఏర్పాటు
- ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం

- మిగతా 2లో



## అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

- పీవీ సింధు, గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి వారి అకాడమీలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించామన్న రవీంద్ర
- రాష్ట్రంలో 6 ప్రత్యేక అకాడమీలు ప్రారంభించామని వెల్లడి
- ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'స్పోర్ట్స్ సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పీవీ సింధు, పుల్లెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖ క్రీడాకారుల అకాడమీలకు ప్రభుత్వం స్థలాలు

- మిగతా 2లో



## గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు

### ఏపీ గ్రీన్ కమిటీ చైర్మన్ నాగబాబు

- తమది నాటే సంస్కృతే కానీ, నరికేది కాదని స్పష్టం
- మంగళగిరి అరణ్యారామంలో రావి-వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు
- హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యమని పిలుపు
- రూ.24 కోట్లతో నిర్మించనున్న అరణ్యారామం భవన డిజైన్ల పరిశీలన

పెన్ పవర్ డెస్క్:ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభు త్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టం చేశారు. హరితాం ధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు.

- మిగతా 2లో

# ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

## సీఎం చంద్రబాబు ప్రకటన






- ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్లతో వైద్య సేవలు
- మందులు, రక్త నమూనాల రవాణాకు డ్రోన్ల వినియోగం
- పీహెచ్‌సీలను జిల్లా ఆసుపత్రులతో అనుసంధానించేలా ప్రణాళిక
- టెక్నాలజీతో ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- మారుమూల ప్రాంతాల్లోని ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందిస్తామని హామీ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు వైద్య సేవలను వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగించుకోనుంది. డ్రోన్ల ద్వారా మందులు, వైద్య పరికరాలను సరఫరా చేసే బృహత్తర ప్రాజెక్టును త్వరలో విస్తృతం చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సాంకేతికత ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చినప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తలపెట్టిన డ్రోన్ ప్రాజెక్టును సమీక్షించినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్పందిస్తూ, రహదారి సౌకర్యాలు పరిమితంగా ఉండే గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో డ్రోన్లు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని అన్నారు. డ్రోన్ల ద్వారా రక్త నమూనాలను సేకరించడం, అత్యవసర ఔషధాలను వేగంగా చేరవేయడం వంటివి ఈ ప్రాజెక్టులో కీలకమని వివరించారు.ఈ వ్యవస్థ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ) జిల్లా ఆసుపత్రులతో,


- మిగతా 2లో

## ఏఐ సాయంతో బ్రెయిన్ సర్జరీ




పెన్ పవర్ డెస్క్: వైద్య రంగంలో ఏఐ తీసుకొస్తున్న మార్పులు ఇప్పటికే స్పష్టంగా కనిపి స్తున్నాయి. వ్యాధులను గుర్తించడం, రోగి బాగోగులు చూడటం, డ్రగ్స్ మోతాదునీ దాని పనితీరునీ పరిశీలించడం,

- మిగతా 2లో



## సజ్జల చేతిలో జగన్ బందీ..

### నాపై దాడి జరిగినా పట్టించుకోలేదు

- వైసీపీలో తనకు ఎదురైన అవమానాలపై విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ
- సజ్జల రామకృష్ణారెడ్డి ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్ అని సంచలన ఆరోపణలు
- పార్టీ ప్లీనరీలో తనపై సజ్జల భౌతికంగా దాడి చేసినా జగన్ మౌనంగా ఉన్నారన్న విజయసాయి
- వైసీపీలో ఇప్పుడు జగన్ నంబర్ 2, సజ్జల నంబర్ 1 అని తీవ్ర విమర్శలు
- ఆత్మగౌరవం చంపుకోలేకనే రాజ్యసభ పదవికి, పార్టీకి రాజీనామా చేశానని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:రాజ్యసభ మాజీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయి రెడ్డి రాజకీయంగా పెను దుమారం రేపారు. వైసీపీలో ఉన్నప్పుడు తనకు ఎదురైన పరిస్థితులు, అవమానాలను వివరిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై నిప్పులు చెరుగుతూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను

- మిగతా 2లో

## ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

## నాణ్యతా లోపాలే కారణం

- ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీల ఇంగువ అమ్మకాలపై నిషేధం
- నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తేల్చిన ఎఫ్ఎస్ఎస్ఏఐ
- నమూనాల్లో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ పరిమాణం చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తింపు
- కంపెనీల ముడిసరుకులోనూ నాణ్యత లోపాలు ఉన్నాయని వెల్లడి
- దిద్దుబాటు చర్యలు చేపట్టాలని రెండు సంస్థలకు స్పష్టమైన ఆదేశం

- మిగతా 2లో




## ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ..

### అధికారులపై ఎమ్మెల్యే దానం ఆగ్రహం

- దానం రాకముందే లక్కీడ్రా ప్రారంభించిన అధికారులు
- ప్రోటోకాల్ ప్రారంభించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారన్న దానం
- బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

- మిగతా 2లో





## వేపచెట్టు రేపిన చిచ్చు.. ఇద్దరి దారుణ హత్య

- సూర్యాపేట జిల్లా ఎర్రగడ్డ తండాలో విషాదం
- గొడ్డళ్లతో దాడులు చేసుకున్న రెండు వర్గాలు
- అడ్డుకునేందుకు యత్నించిన ఎస్సై నవీన్ కుమార్ కి గాయాలు

- మిగతా 2లో

## ఎంఐఎం నుంచి బహిష్కరణ..

### అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ

- ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన మజ్లిస్
- సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నవి డీప్‌ఫేక్ వీడియోలని ఆరోపణ
- తనను, పార్టీని అప్రతిష్టపాలు చేసే కుట్ర అని రహ్మత్ బేగ్ వ్యాఖ్య
- వీడియోలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ముందే ఫిర్యాదు చేశానని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను ఎంఐఎం పార్టీ నుంచి బహిష్కరించడం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర

- మిగతా 2లో



## హర్మ్యూజ్ సంక్షోభం

### గల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది

- ఆరు నెలలుగా కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంక్షోభం
- అంతర్జాతీయ షిప్పింగ్‌పై 70 దాడులు, 19 మంది నావికుల మృతి
- ఇంధనం, ఎరువుల సరఫరా గొలుసులపై తీవ్ర ప్రభావం
- పరిష్కారానికి కృషి చేయాలని సభ్య దేశాలకు ఐఎంఓ పిలుపు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు

- **మొదటి పేజీ తరువాయి**

శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి-వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం, రూ. 24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమశైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

- **మొదటి పేజీ తరువాయి**

కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు.

రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని వైజాగ్, అమరావతి, తిరుపతిగా 3 జోన్లుగా విభజించినట్లు తెలిపారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సీఎస్ఆర్ నిధులతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు.

# ఏఐ సాయంతో బ్రెయిన్ సర్జరీ

- **మొదటి పేజీ తరువాయి**

స్కానింగ్ రిపోర్టులను విశ్లేషించడం ఇలా వైద్యరంగంలో ఏఐ వేగంగా విస్తరిస్తోంది. ఇలాంటి వాటి సాయంతో మెదడుకు జరిగిన ఓ శస్త్రచికిత్స విజయవంతమైంది. యూకే కు చెందిన ఆ పేషెంట్ కోలుకొని, ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారు.

యూకేకు చెందిన 48 ఏళ్ల రిస్ హిబ్బర్ట్.. ఒకరోజు నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు హఠాత్తుగా స్పృహకోల్పోయారు. తర్వాత మూర్ఛకు లోనయ్యాడు. అప్పటివరకు అతడికి ఎలాంటి అనారోగ్యమూ లేదు. వైద్యులు మెదడుకు స్కానింగ్ తీయగా.. పిట్యుటరీ గ్రంథి సమీపంలో 11 మి.మీ. పరిమాణంలో కణితి ఉందని గుర్తించారు. అది క్యాన్సర్ కాదని తేలినా.. చూపుపై ప్రభావం పడింది. దానిని తొలగించకపోతే.. కంటిచూపు పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని అర్థమైంది. అతను చిన్నదానికే అలసటకు గురయ్యేవాడు.

వైద్యులు అతనికి ఏఐ టెక్నాలజీ సాయంతో శస్త్రచికిత్స నిర్వహించారు. మేలోనే అది జరిగినా.. పేషెంట్ పూర్తిగా కోలుకునేవరకు దాని గురించి బయటపెట్టలేదు. ఎండోస్కోపీ అందించిన లైవ్ సర్జరీ వీడియోను ఏఐ విశ్లేషించడంతో సంక్లిష్ట ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించేలా వైద్యులకు వీలుకలిగింది. ఈ వివరాలను వైద్యులు మీడియాకు వెల్లడించడంతో తాజాగా విషయం వెలుగులోకి వచ్చింది.

# ఎంఐఎం నుంచి బహిష్కరణ..

## అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ

- **మొదటి పేజీ తరువాయి**

వీడియోలు వైరల్ కావడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే, ఆ వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలని, తనను అప్రతిష్ఠపాలు చేసేందుకే ఈ కుట్రకు పాల్పడ్డారని రహ్మత్ బేగ్ ఆరోపించారు.

పార్టీ బహిష్కరణకు ముందే తన కుటుంబంతో కలిసి మక్కా వెళ్లిన రహ్మత్ బేగ్, అక్కడి నుంచే ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. హైదరాబాద్‌లోని తన స్నేహితులు ఫోన్ చేసి సోషల్ మీడియాలో కొన్ని అశ్లీల వీడియోలు వైరల్ అవుతున్నట్లు సమాచారం అందించారని ఆయన పేర్కొన్నారు. ఆ వీడియోలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగానే తనపై కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీని, పార్టీ అధినేతలు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల ప్రతిష్ఠను దిగజార్చేందుకే ఈ డీప్ ఫేక్ వీడియోలను సృష్టించారని ఆయన వివరించారు.

ఈ అంశంపై తాను ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగంతో పాటు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశానని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని రహ్మత్ బేగ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 28వ తేదీ రాత్రి ఎంఐఎం అధిష్ఠానం ఆయనను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. శాసనమండలి సభ్యత్వానికి కూడా వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను పార్టీ అధికారికంగా ప్రకటించలేదు. తాజా పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని ఇతర రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్ఠమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన దుస్థితి ఉండకూడదన్నదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'సంజీవని' కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలతో పాటు కనెక్టివిటీకి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్లను

ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలోనే అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకే భోగాపురంలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. గిరిజన బిడ్డలు థింసా నృత్యంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు

## ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

# నాణ్యతా లోపాలే కారణం

ప్రముఖ మసాలా దినుసుల బ్రాండ్లు ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్, లాల్జీ గోధూ కంపెనీలకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఖీూూాఃు) గట్టి షాక్ ఇచ్చింది. ఈ రెండు సంస్థలు విక్రయిస్తున్న కాంపౌండెడ్ ఇంగువ (హింగ్ పౌడర్) నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేలడంతో, వాటి అమ్మకాలపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా వెల్లడించింది.

మార్కెట్‌లో నిరంతర నిఘా, చట్టపరమైన నమూనాల సేకరణ అనంతరం జరిపిన పరీక్షల్లో ఈ రెండు కంపెనీల ఇంగువ ఉత్పత్తులు నాణ్యత తక్కువగా (సబ్-స్టాండర్డ్) ఉన్నాయని, కొన్ని సందర్భాల్లో తప్పుడు బ్రాండింగ్ (మిస్‌బ్రాండెడ్) లేదా కల్తీకి గురైనట్లు గుర్తించామని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది.

**ఎవరెస్ట్ ఉత్పత్తుల్లో తీవ్ర లోపాలు**

ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్ విక్రయిస్తున్న ఇంగువ పొడి, దాని వేరియంట్లలో నాణ్యత లోపాలు స్పష్టంగా కనిపించాయి. ఒక నమూనాలో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ నిబంధనల ప్రకారం కనీసం 5 శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 0% ఉన్నట్లు ప్రయోగశాల పరీక్షల్లో తేలింది. అదేవిధంగా, ఎవరెస్ట్ యెల్లో హింగ్ పౌడర్‌లో 3.29%, బ్లాక్ హింగ్ పౌడర్‌లో 4.4 శాతం మాత్రమే ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ ఉన్నట్లు గుర్తించారు. గతంలో కూడా ఈ కంపెనీకి చెందిన చికెన్ మసాలా, గరం మసాలా, ఎగ్ కర్రీ పౌడర్ వంటి ఉత్పత్తుల లేబులింగ్‌లో లోపాలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తుచేసింది.

**లాల్జీ గోధూ ఇంగువలోనూ అదే పరిస్థితి**

లాల్జీ గోధూ కంపెనీకి చెందిన పొడి, గడ్డల రూపంలో ఉన్న ఇంగువ నమూనాలు కూడా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా, ఇంగువ తయారీకి ఉపయోగించే ముడిసరుకులోనూ అధికంగా స్టార్చ్ (పిండి పదార్థం) ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం ఇంగువలో స్టార్చ్ ఒక శాతానికి మించి ఉండకూడదు. మార్కెట్‌లో సేకరించిన పలు బ్యాచ్‌ల నమూనాల్లో ఈ ఉల్లంఘనలు విస్తృతంగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది.

ఈ నేపథ్యంలో, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీలు తమ ఇంగువ ఉత్పత్తుల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. తమ ఉత్పత్తుల్లోని లోపాలను సరిదిద్దడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఇకపై కేవలం నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే తయారుచేసి విక్రయించాలని స్పష్టం చేసింది. ఆదేశాలను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# సజ్జల చేతిలో జగన్ బందీ..

## నాపై దాడి జరిగినా పట్టించుకోలేదు

- **మొదటి పేజీ తరువాయి**

విడుదల చేశారు. తనపై "నమ్మకద్రోహి" అంటూ వైసీపీలోని ఓ వర్గం దుష్ప్రచారం చేయిస్తున్నందునే ఈ లేఖ రాయాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ లేఖలో ఆయన చేసిన ఆరోపణలు, వెల్లడించిన విషయాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

**సజ్జల ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్**

"నేనే గనక నమ్మకద్రోహిని అయితే, ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని సీబీఐ, ఈడీ చార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌గారికి నమ్మకస్తుడిననే ఒకే ఒక్క కారణంతో ప్రతి చార్జిషీట్‌లో నన్ను ఏ-2గా చేర్చారు. జగన్‌గారు 16 నెలలు జైల్లో ఉంటే, నేను 15 నెలలు జైల్లో ఉన్నాను. నమ్మకద్రోహం నా రక్తంలో ఉంటే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని" అని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. 2024 ఎన్నికల తర్వాత కూడా తనకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో ఏ-5గా, కాకినాడ సీపోర్టు కేసులో ఏ-2గా తనను చేర్చారని, కానీ ఈ రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో "సకల శాఖల మంత్రి" అయిన సజ్జల పేరు ఒక్క చార్జిషీట్‌లో కూడా లేకపోవడం గమనార్హమన్నారు. జగన్‌కు వెన్నుపోటు పొడుస్తూ, టీడీపీతో కలిసి ఎలా పనిచేయాలో, కేసులు లేకుండా ఎలా చూసుకోవాలో ఆ "కోటరీ నాయకుడికి" తెలిసినంత తనకు తెలియదని ఎద్దేవా చేశారు.

**ప్లీనరీలో భౌతిక దాడి.. జగన్ ప్రేక్షకపాత్ర**

2022లో మంగళగిరిలో జరిగిన పార్టీ ప్లీనరీలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నేరుగా భౌతికంగా దాడి చేశారని, ఈ విషయం జగన్‌కు తెలిసినా ప్రేక్షకపాత్ర వహించారని విజయసాయి రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. పార్టీలో ఉన్న ఇతర నాయకులు కూడా ఈ ఘటనను చూశారని తెలిపారు. అప్పటికే సజ్జల చేతిలో జగన్ బందీ అయిపోయారని, అందుకే తనను పూర్తిగా పక్కనపెట్టేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో "సాయన్నకు వయసైపోయింది, ముసలోడైపోయాడు" అంటూ అనుబంధ సంఘాల బాధ్యతల నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ తర్వాత ఉత్తరాంధ్ర, గుంటూరు నుంచి తిరుపతి వరకు ఉన్న జిల్లాల ఇంఛార్జ్ బాధ్యతల నుంచి, చివరకు కోర్ కమిటీ నుంచి కూడా తొలగించారని వివరించారు. ఇలాంటివి మొత్తం 74 అవమానాలు జరిగాయని, ఎన్నో విషయాలు కడుపులోనే దాచుకున్నానని అన్నారు.

**సకల శాఖల మంత్రిగా సజ్జల.. జగన్‌కు గోడ కట్టారు**

"2019లో పార్టీ ఘనవిజయం సాధించిన తర్వాత సజ్జల ప్రమేయం శృతిమించింది. పరిపాలన జగన్‌గారు చేశారా లేక సజ్జల 'సకల శాఖల మంత్రి'గా, రాజ్యాంగేతర శక్తిగా తన ముఠాతో చేశారా? ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సైతం అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా జగన్‌ను కలవనీయకుండా గోడ కట్టింది సజ్జల కాదా?" అని విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. పెద్దిరెడ్డి, బొత్స, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరినీ రీజినల్ కోఆర్డినేటర్లుగా పెట్టి, అందరూ చీఫ్ కోఆర్డినేటర్ సజ్జలకు రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు తనకు ఆమోదయోగ్యం కాలేదన్నారు. అందుకే తన ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేయలేక, నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలాన్ని ముందే వదులుకుని పార్టీకి కూడా రాజీనామా చేశానని స్పష్టం చేశారు.

**వైసీపీలో నంబర్ 2 జగన్.. నాది కోవర్ట్ రాజకీయం కాదు**

"ఇప్పుడు వైసీపీలో నంబర్ 2 ఎవరంటే జగన్‌గారు. నంబర్ 1 ఎవరంటే 'సకల శాఖల మంత్రి' సజ్జల" అని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ కొత్త నంబర్ వన్‌కు నమస్కారాలు, సాష్టాంగాలు పెడుతూ తాను సర్దుకుపోలేనని, అందుకే పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. తాను జగన్‌కు ఎన్నడూ ద్రోహం చేయలేదని, చేయబోనని స్పష్టం చేశారు.

పార్టీని కబ్జా చేసి, జగన్‌ను మోసం చేస్తూ కోవర్ట్ రాజకీయం చేయడం తనకు చేతకాదని, తాను ప్రజాస్వామ్యబద్ధంగా నేరుగా గెలిచేందుకే యుద్ధం చేస్తానని, అందుకే కొత్త పార్టీ పెడుతున్నానని ప్రకటించారు. పార్టీలో ఎవరు కోవర్టుగా పనిచేస్తున్నారో కార్యకర్తలు, అభిమానులు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. మరో సందర్భంలో మీడియా ద్వారా మరిన్ని నిజాలు తెలియజేస్తానని తన లేఖను ముగించారు.

# శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వినియోగించుకోవడం లేదు

శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ దానిని ఉపయోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 71 శాతం వరకు నీటి నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ... సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన నిలదీశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వెంటనే నీటిని ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలని... రాయలసీమ, నెల్లూరు జిల్లా రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ఉద్దేశమా అని ప్రశ్నించారు.

నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించినా ప్రభుత్వం మౌనంగా ఉండటం వెనుక ఉన్న దురుద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి నీటిని ఎడాపెడా తరలించుకుపోతుంటే, ఏపీ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని కాకాణి మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల కోసం చంద్రబాబు ఏపీ రైతుల జీవితాలను తాకట్టు పెడుతున్నారా అని ప్రశ్నించారు. సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్లే మొదటి పంటకే సాగునీరు అందక నెల్లూరు జిల్లా రైతాంగం ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.

## ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

- **మొదటి పేజీ తరువాయి**

ఇతర వైద్య విభాగాలతో అనుసంధానించడం సులభతరం అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఉన్న ఈ విధానాన్ని మరింత వ్యవస్థీకృతం చేసి, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతంలో నివసించే ప్రతి పౌరుడికీ నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. టెక్నాలజీ సహాయంతో ఆరోగ్య సేవలను మరింత వేగవంతం చేసి, ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థలను బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ ద్వారా ఈ వివరాలను పంచుకున్నారు.

# వేపచెట్టు రేపిన చిచ్చు.. ఇద్దరి దారుణ హత్య

సూర్యాపేట జిల్లాలో ఓ చిన్న వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య రేగిన చిచ్చు... దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో గొడ్డలి వేట్లకు గురైన ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఈ ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతో పాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో... ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ..

ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ/గృహలక్ష్మి ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ధ్వజమెత్తారు. తాను రాకముందే అధికారులు లక్కీ డ్రా ప్రారంభించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వయంగా డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఆయన రాకముందే అధికారులు ప్రక్రియను ప్రారంభించడంతో తీవ్ర అసంతృప్తికి గురైన దానం నాగేందర్ అధికారులపై మండిపడ్డారు.

ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా, ప్రోటోకాల్ పాటించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని దానం నిలదీశారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నిరసనగా కార్యక్రమం మధ్యలోనే అలిగి వెనుదిరిగారు. కాగా, హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం నాలుగు రోజుల పాటు ఈ లక్కీ డ్రా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# హర్మూజ్ సంక్షోభంగల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఏర్పడిన సంక్షోభం కారణంగా గత ఆరు నెలలుగా సుమారు 400 నౌకలు, వాటిలోని దాదాపు 6,000 మంది సిబ్బంది చిక్కుకుపోయారని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) శుక్రవారం వెల్లడించింది.

ఈ సంక్షోభం ఇంకా సమసిపోలేదని ఐఎంఓ సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగ్యూజ్ తెలిపారు. కొన్ని నౌకలు, సిబ్బంది ఆ ప్రాంతం నుంచి బయటపడగలిగినప్పటికీ, వేలాది మంది నావికులు ఇప్పటికీ తీవ్ర ముప్పును, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఈ అంతరాయం కారణంగా ఇంధనం, ఎరువులు వంటి నిత్యావసర వస్తువుల ప్రపంచ సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 28న ఈ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ నౌకాయానంపై కనీసం 70 దాడులు జరిగినట్లు ఐఎంఓ ధృవీకరించింది. ఈ దాడుల్లో 19 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ జలసంధుల గుండా రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని జూలైలో ఐఎంఓ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ జలమార్గంలో నౌకాయానాన్ని పునరుద్ధరించడానికి సభ్య దేశాలన్నీ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చింది.

ఈ సమస్యకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనేందుకు సభ్య దేశాలు, షిప్పింగ్ పరిశ్రమ కలిసి పనిచేయాలని డొమింగ్యూజ్ కోరారు. మరోవైపు, నల్ల సముద్రం, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ వంటి ప్రాంతాల్లో కూడా సముద్ర భద్రత క్షీణిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడులతో మొదలైన ఈ వివాదంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, నౌకాయానం, ఇరాన్ అణు కార్యక్రమం, అంతర్జాతీయ ఆంక్షల వంటి అంశాలపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది.

# ప్రతి స్వర్ణ గ్రామంలో రోజూ పిజిఆర్ఎస్

**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 29 :** వై.రామవరం, గుర్తేడు మండలాల్లో ఉన్న ప్రతి గ్రామ కార్యాలయంలో పని దినాలలో సాయంత్రం మూడు గంటల నుండి 5 గంటల వరకు విధిగా పి జి ఆర్ ఎస్ నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులలో ఆదేశించిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు. ప్రతి స్వర్ణ గ్రామ సిబ్బంది ప్రజల నుండి నిత్యం వినతులు స్వీకరించాలని, ఈ విషయం ప్రజలకు తెలియజేయవలసిన ఆవశ్యకత స్వర్ణ గ్రామ సిబ్బందిపై ఉందన్నారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై స్పందించి వెంటనే పరిష్కారించాలని జరిగిందని తెలిపారు.




# దోసకాయలపల్లిలో ఒక ప్రైవేట్ హాస్టల్ లో 60 మంది పిల్లలకు ఫుడ్ పాయిజన్ కలకలం

## మృత్యువుతో పోరాడుతున్న బాలిక! ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏమయ్యారు?








**కోరుకొండ / గోకవరం - పెన్ పవర్ ఆగస్టు 29:-** తూర్పుగోదావరిజిల్లా కోరుకొండ మండలం దోసకాయలపల్లిలోని గుడ్ సామ్ రిటర్న్ హోం మినిస్ట్రీస్ అనే ప్రైవేట్ వసతి గృహంలో శనివారం మధ్యాహ్నం పెద్ద విషాదం చోటు చేసుకుంది. కలుషిత ఆహారం తిని 60 మందికి పైగా చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురై విలవిలలాడారు. శనివారం మధ్యాహ్నం పిల్లలందరికీ కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. 170 మంది విద్యార్థులు ఉన్న ఆ హోం లో ఒకరి తర్వాత ఒకరు కళ్ళు తిరిగి పడిపోవడంతో ఒక్కసారిగా హాహాకారాలు చెల రేగాయి. యాజమాన్యం సమాచారం ఇవ్వడంతో రాజమహేంద్రవరం డి ఎం అండ్ హెచ్ ఓ డా. పి. కోమలి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాలు హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకుని అత్యవసర చికిత్స అందించాయి. పరిస్థితి అదుపులోకి వచ్చినా, 12 ఏళ్ల బాలిక పరిస్థితి విషమించడంతో రాజమండ్రి జి జి ఎచ్ కి తరలించారు. ప్రస్తుతం ఆ బాలిక మృత్యువుతో పోరాడుతోంది. మరో ముగ్గురు బాలికలు దోసకాయలపల్లి పీ హెచ్ సి లో చికిత్స పొందుతున్నారు.

కోడి మాంసమే కారణమా..?

ఈ హోం లో ప్రతి బుధ, శుక్రవారాల్లో పిల్లలకు కోడి మాంసంతో భోజనం పెడతారని, శనివారం పెట్టిన మాంసం వల్లే ఫుడ్ పాయిజన్ జరిగిందని వైద్య శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. అక్కడ వాడుతున్న సరుకులు, నిల్వ ఉంచిన ఆహారం నమూనాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

**తూర్పుగోదావరిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారా? ప్రశ్నిస్తున్న ప్రజలు.**

నూతన తూర్పుగోదావరి జిల్లా ఏర్పడిన తర్వాత ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారనే మాటే వినిపించడం లేదు. వారు కేవలం కార్యాలయాలకే పరిమితమయ్యారు. నిరంతరం తనిఖీలు చేయాల్సిన వారు, ఎప్పుడో ఏదో ఘోరం జరిగితేనే బయటకు వస్తున్నారు. శనివారం రాజమండ్రికి కేవలం 25 కి.మీ దూరంలో 70 మంది పిల్లలు విషాహారం తిని అల్లాడు తుంటే, సాయంత్రం వరకు ఒక్క ఫుడ్ సేఫ్టీ అధికారి కూడా హోంను సందర్శించలేదంటే వారి నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఇదే కోరుకొండ మండలం నరసాపురంలో కల్తీ పాలు వల్ల 20 మందికి పైగా మృత్యువాత పడితే జిల్లా యంత్రాంగం హడావిడి చేసి మళ్లీ నిద్రలోకి జారుకుంది. ఇప్పుడు మళ్లీ అదే నిర్లక్ష్యం. జిల్లాలో 18 మండలాలు ఉంటే కనీసం నెలకు 5 మండలాల్లో కూడా తనిఖీలు చేయని ఈ అధికారులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలి. నెలకు రెండు సార్లు ప్రతి మండలంలో తనిఖీలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలి. లేకపోతే రేపు మరో చోట ఇలా జరగదని ఎవరు గ్యారెంటీ ఇస్తారు 60 మంది పిల్లల ప్రాణాలకు ఎవరు బాధ్యులు.....? దీనికి సంబంధిత అధికారులు బాధ్యత వహించాలి అంటూ పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# జాతీయ క్రీడ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహణ



**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 29 :** జాతీయ క్రీడ, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా మండలంలో ప్రతి పాఠశాలలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహించడం జరిగింది.

వ్యాచరచన పోటీలు కూడా నిర్వహించడం జరిగిందని తెలిపారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్, వ్యచరచన లో నెగ్గిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వై. రామవరం ఎంఈఓ 2 జోగేశ్వరరావు దాలిపాడు పాఠశాల ఉపాధ్యాయులు, ఏ యు పి ఎస్, వై రామవరం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# గోదావరి పుష్కర ఏర్పాట్లపై క్షేత్రస్థాయి కసరత్తు





**ఘాట్లు, ఆలయాల వద్ద రద్దీ నియంత్రణకు ముందస్తు చర్యలు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 29:** గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి మెరుగైన సౌకర్యాలు, సురక్షితమైన రాకపోకలు కల్పించడంతో పాటు క్రౌడ్ మేనేజ్‌మెంట్‌కు ముందస్తు చర్యలు చేపట్టడమే క్షేత్రస్థాయి పర్యటన ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పుష్కర ఘాట్లు, ప్రముఖ ఆలయాలు, రవాణా, పార్కింగ్, పుష్కర నగరాలు తదితర ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయడానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, రెవెన్యూ, పోలీస్, ఆర్ఎంసీ, దేవాదాయ తదితర సమన్వయ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కోటిలింగాల ఘాట్‌కు చేరుకునే మార్గాలు, ఘాట్ పరిసరాలు, శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం, లూథర్‌గిరి, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అదే సమయంలో ఆర్ట్స్ కళాశాల వద్ద చేపట్టనున్న ఏర్పాట్లపై చర్చించారు. ఆయా ప్రాంతాల్లో భక్తుల రాకపోకలు, పార్కింగ్, బస్సుల నిర్వహణ, నడక మార్గాలు, క్యూలైన్లు, ఎంట్రీ--ఎగ్జిట్ మార్గాలు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పుష్కరాల సమయంలో భక్తుల తాకిడికి అనుగుణంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో అధికారులతో చర్చించారు. కోటిలింగాల ఘాట్‌కు భక్తులు చేరుకునే మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. భక్తులను ఒకేసారి ఘాట్లకు అనుమతించకుండా దశలవారీగా తరలించడం ద్వారా రద్దీని సమర్థవంతంగా నియంత్రించాలని, పోలీస్ శాఖ రూపొందించిన క్రౌడ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికను మరింత శాస్త్రీయంగా రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఘాట్ల వద్ద భక్తుల ప్రవేశం, నిష్క్రమణకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేసి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోటిలింగాల ఘాట్ వద్ద ఉన్న శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల ప్రవేశ మార్గం, వెలుపలకు వచ్చే మార్గం, క్యూలైన్ల నిర్వహణ తదితర అంశాలపై దేవస్థానం ఈఓతో కలెక్టర్, ఎస్పీ చర్చించారు. భక్తుల తాకిడికి అనుగుణంగా పుష్కర ఘాట్ల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య, భద్రత తదితర ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఘాట్లు, దేవాలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పుష్కర స్నానాల కోసం వచ్చే భక్తుల కోసం లూథర్‌గిరి, ఆర్ట్స్ కళాశాల ప్రాంతాల్లో సెటిల్ బస్సుల కోసం తాత్కాలిక బస్‌స్టాండ్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల నుంచి పుష్కర ఘాట్లకు భక్తులు సురక్షితంగా చేరుకునేందుకు ప్రత్యేక నడక మార్గాలను ఏర్పాటు చేయడంతో పాటు రాకపోకలకు విడివిడిగా మార్గాలు రూపొందించనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా పుష్కర ఘాట్లు, ప్రముఖ దేవాలయాల వద్ద క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు అందించాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, స్థానిక సంస్థలు, ఇంజనీరింగ్, దేవాదాయ తదితర శాఖలతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా ప్రాంతాలపై అవగాహన కలిగిన వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. పుష్కరాల కోసం రూపొందించే కార్యాచరణ ప్రణాళిక భవిష్యత్ అవసరాలకు కూడా ఉపయోగపడేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

గోదావరి పుష్కరాల సందర్భంగా ఘాట్లు, ఆలయాలు, రహదారులు, పార్కింగ్ ప్రాంతాల్లో భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. భక్తుల రాకపోకలకు ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను వేర్వేరుగా ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడింగ్, క్యూలైన్లు, ట్రాఫిక్ డైవర్షన్లు, పార్కింగ్ నియంత్రణ వంటి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల నుంచి భక్తులను దశలవారీగా ఘాట్లకు తరలించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని, అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక మార్గాలను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పరిశీలించి భక్తులకు సురక్షితమైన పుష్కర అనుభూతి కల్పించేలా చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు. పర్యటనలో స్పెషల్ ఆఫీసర్ మహేష్, డీఎస్పీ వై.శ్రీకాంత్, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఈఈ(ఆర్ఎంసీ) మదర్శా అలీ, సీఐ(ట్రాఫిక్) నబి, సీఐ(వన్‌టౌన్) విజయ శంకర్, దేవాదాయ శాఖ అధికారులు, ఆర్ఎంసీ అధికారులు, రెవెన్యూ, పోలీస్, ఇంజనీరింగ్, ఇతర సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గోకవరం ఇందిరమ్మ ( ఎరకల దిబ్బ )కాలనీకి చీకటి శాపం!

- **వైన్ షాపు,స్మశానం మధ్యలో మహిళల నరకయాతన**
- **సాయంత్రం 6 దాటితే పొదల్లో మందుబాబుల హల్ చల్**

**గోకవరం పెన్ పవర్ ఆగస్టు 29:-** గోకవరం మండల కేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ కాలనీ వాసులకు 200 మీటర్ల రోడ్డు నరకంగా మారింది. గోకవరం నుండి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో సౌకర్యాలు లేక మహిళలు, చిన్నారులు నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ 200 మీటర్ల రోడ్డులోనే వైన్ షాపు ఉండటంతో సాయంత్రం కాగానే మందుబాబుల బెడద ఎక్కువైపోతోంది. షాపు నుండి బయటకు వచ్చిన మందుబాబులు రోడ్డు పక్కనే, పక్కనే ఉన్న స్మశానంలోకి వెళ్లి మద్యం సేవిస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

దానికి తోడు ఈ రోడ్డులో ఒక్క వీధిలైటు కూడా లేదు. సాయంత్రం ఆరు దాటితే చిమ్మ చీకటి. పక్కనే ఉన్న స్మశానం నిండా పిచ్చి పొదలు, ముళ్ల చెట్లతో నిండి భయానకంగా మారింది. ఆ చీకట్లో స్మశానం పక్క నుండి వెళ్లాలంటే మహిళలు, స్కూల్ నుండి వచ్చే చిన్నపిల్లలు వణికిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నడుస్తున్నారు. ఇందిరమ్మ మోడల్ కాలనీ అంటే ప్రభుత్వం గర్వంగా చెప్పుకునే కాలనీ. అలాంటి కాలనీకి కనీసం వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో గోకవరం పంచాయతీ ఉంది. లక్షలు ఖర్చు పెట్టి కాలనీ కట్టి, 200 మీటర్ల రోడ్డుకు లైట్లు వేయలేక పోవడం పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. సంబంధిత పంచాయతీ అధికారులు వెంటనే ఆ రోడ్డులో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, స్మశానంలోని పిచ్చి పొదలను తొలగించి శుభ్రం చేయాలని, వైన్ షాపు వద్ద పోలీసు నిఘా పెట్టి మహిళలకు రక్షణ కల్పించాలని పంచాయతీ అధికారులు, ఎంపీడీవో తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఇందిరమ్మ కాలనీ మహిళలు హెచ్చరిస్తున్నరు.



# ఉమెన్స్ కాలేజ్లో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ ఉద్యోగ మేళా









**యువత భవిష్యత్తుకు మరో ముందడుగు**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 29.** తాడేపల్లిగూడెం ఉమెన్స్ కాలేజ్లో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ ఉద్యోగ మేళాలో ప్రభుత్వ విప్ మరియు తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని యువతను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతు నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యమే విజయానికి పునాది. ప్రతి విద్యార్థి, ప్రతి గ్రాడ్యుయేట్ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఉద్యోగ మేళాలో పాల్గొన్న అన్ని కంపెనీల ఇంటర్వ్యూలకు ధైర్యంగా హాజరై, మీ ప్రతిభను ప్రదర్శించండి. ప్రతి ఇంటర్వ్యూ ఒక కొత్త అవకాశం, ప్రతి అవకాశం మీ భవిష్యత్తును మార్చే శక్తి కలిగి ఉంటుంది. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి... విజయం మీదే."

యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో వారిని తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యం. ఈ ఉద్యోగ మేళా ద్వారా వందలాది మంది యువత తమ కెరీర్కు తొలి అడుగు వేయాలని ఆకాంక్షిస్తూ...అవకాశాన్ని అందిపుచ్చుకోండి... మీ భవిష్యత్తును మీరే నిర్మించుకోండి అని అన్నారు.

## వేమన శతకం పద్యాలు ఆలపించిన ఉషోదయ విద్యార్థులు





**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగష్టు 29:** ఉంగుటూరు మండలం నారాయణపురం ఉషోదయ హైస్కూలులో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం "ఏకాదశ సహస్ర గళార్చన -- వేమన శతకం" కార్యక్రమాన్ని నిర్వహించారు.

గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నేటి తరం విద్యార్థుల్లో తెలుగు భాషపై పట్టు పెంపొందించడంతో పాటు మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలనే ఉద్దేశంతో మాతృభాషా పరిరక్షణ సేవా సమితి, ప్రగతి భారతం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు.

ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో 100 మంది విద్యార్థులతో వేమన శతక పద్యాలను సామూహికంగా ఆలపించారు. నారాయణపురం ఉషోదయ హైస్కూలులో ప్రిన్సిపాల్ గుణ్ణం బుల్లెబ్బాయి, తెలుగు ఉపాధ్యాయిని రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులు వేమన శతక పద్యాలను ఆలపించారు.

ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు సైతం ఆసక్తిగా తెలుగు పద్యాలను ఆలపించడం పట్ల నిర్వాహకులు, ఉపాధ్యాయులు అభినందించారు. మాతృభాషపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.

## బాదంపూడి మోడల్ ప్రైమరీ పాఠశాలలో నో బ్యాగ్ డే



**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగష్టు 29**: ఉంగుటూరు మండలం బాదంపూడి మోడల్ ప్రైమరీ పాఠశాల నెం.1లో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని ఉపాధ్యాయుడు అల్లు శ్రీను ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు చిత్రలేఖనం, ఇల్లు మోడల్, రాఖీలు, గోడ గడియారం తదితర వస్తువులను సృజనాత్మకంగా తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయురాలు ఎం. అరుణకుమారి విద్యార్థులతో అగ్గిపుల్లలను ఉపయోగించి వివిధ ఆకారాలను తయారు చేయించారు. అనంతరం విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అల్లు శ్రీను మాట్లాడుతూ నో బ్యాగ్ డే ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు, ఆసక్తిని పెంపొందించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ సృజనాత్మక, క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమగ్రంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు.ం

## డైమండ్స్ లయన్స్ క్లబ్ జాతీయ క్రీడా దినోత్సవం

## తెలుగు భాషా దినోత్సవం వేడుకలు.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 28.** తెలుగు భాషా అభివృద్ధి జరగక పోతే తెలుగు వైభవం కనుమరుగయ్యే పరిస్థితి వస్తుంది అని లయన్స్ జిల్లా 316 జి రీజియన్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు

డైమండ్స్ లయన్స్ డైరెక్టర్ లయన్ బడుగు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక గుణ్ణం ఫంక్షన్ ప్రాంగణంలోను మోదుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోను తెలుగు భాషా దినోత్సవం. జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిపారు గిడుగు రామూర్తి పంతులు గారి జయంతి సందర్భంగా తెలుగు భాషకు ఆయన అందించిన సేవలు స్మృతి చేసుకుంటూ నివాళులు అర్పించి మాట్లాడుతూ తెలుగు ను తల్లి తండ్రులు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలను ప్రోత్సాహించాలని నిత్య వ్యవహారం తెలుగులో మాట్లాడాలని అన్నారు అలానేజాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఇటీవల జాతీయ క్రీడాలకు ఎంపిక ఐన విద్యార్థు లను అభినందించారు. విద్యార్థుల తో క్రీడలు ఆడించారు తెలుగు భాష కు ఊపిరి పోసిన గిడుగు రామూర్తి పంతులు తదితరులు పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు అమరావతి ఛాంపియన్ 2026 యోగా స్టేట్ ఛాంపియన్ షిప్ లో పాల్గొన్న విద్యార్థుల ను అభినందనలు అందించారుఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు స్కూల్. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకనీ ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ శ్రీనివాస్.



**అడ్డతీగల ,పెన్ పవర్, ఆగస్టు 29:** అడ్డతీగల మండలం ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు ఆన్లైన్ అటెండెన్స్ ఉదయం 9.00 గంటలకు ఖచ్చితంగా పూర్తి కావాలని అలాగే సాయంత్రం కూడా ఆన్లైన్లో హాజరు వెయ్యాలని ఎంఈఓ శ్రీనివాస్ ఆదేశించారు. విద్యార్థుల ఆన్లైన్ అటెండెన్స్ కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని, ఉపాధ్యాయుల హాజరు మరియు పనితీరు పరిశీలించడం జరిగినది అనే ఆయన తెలిపారు. మధ్యాహ్నం భోజనం పథకం మెనూ పరిశీలించరూ ,మెనూ సక్రమంగా నిర్వహిస్తున్నందుకు ప్రధానోపాధ్యాయుడు ని అభినందించరు .మెనూ కు సంబంధించి కోడిగుడ్లు, చిక్కి ,రాగి పౌడర్, బియ్యం వదలైన వస్తువులను పరిశీలించి ,సక్రమంగా విద్యార్థులకు ఇవ్వాలని ఎంఈఓ ఆదేశించారు. ఇంప్లిమెంట్ ఏజెన్సీ కి మెనూ సరఫరాలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎంఈఓ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు ఆర్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు కే. గంగరాజు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి

ఏపీ నిట్ డీన్ పరిశోధన, సంప్రదింపుల విభాగం డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి








**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 29** :విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఏపీ నిట్ డీన్ పరిశోధన, సంప్రదింపుల విభాగం డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ నిట్ డీన్ విద్యార్థి సంక్షేమ విభాగం డాక్టర్ కె.హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీన్ పరిశోధన, సంప్రదింపుల విభాగం డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాకీ క్రీడాకారుడు, మేజర్ ద్యానచంద్ చిత్రపటానికి పులమాలలువేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని చెప్పారు. క్రీడలు క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామం వంటి శారీరక కార్యకలాపాలకు కేటాయించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవటంతోపాటు ఒత్తిడిని తగ్గించుకోవచ్చని వివరించారు. డీన్ విద్యార్థి సంక్షేమ విభాగం డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తినిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి దేశానికి, విద్యాసంస్థకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆచార్యులు శీనివాసన్ వ్యవహరించారు. వివిధ క్రీడా పోటీల్లోఅద్భుత ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచిన పలువురు క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. అనంతరం ప్రాంగణంలోని పరిపాలనా భవనం నుంచి ఏపీ నిట్ తూర్పు ముఖద్వారం వరకు నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సాస్ సహాయకులు కె.వీర వెంకట సాయిరాం ప్రసాద్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆచంటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ





**పెన్ పవర్ ఆచంట, ఆగష్టు 29,** ఆచంటనియోజకవర్గం.స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ. ఆధ్వర్యంలో ఆచంట సెంటర్లో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్నిఆవిష్కరించిన కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ.మీడియతో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.ఎన్టీఆర్ సేవలను, ఆయన ప్రజా సంక్షేమ పాలనను నేతలు కొనియాడారు.తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్.

పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ప్రారంభించిన అన్న క్యాంటీన్లు ఎంతోమందికి అండగా నిలిచాయని తెలిపారు.అయితే గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తొలగించి పేదలకు అన్యాయం చేసిందని విమర్శించారు.తమిళనాడులో ప్రభుత్వాలు మారినా అమ్మ క్యాంటీన్లు కొనసాగుతున్నాయని, పేదలకు తక్కువ ధరకే ఆహారం అందిస్తున్నాయని శ్రీనివాసవర్మ తెలిపారు.ఆంధ్రప్రదేశ్లోనూ అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి పేదలకు అండగా నిలిచామని చెప్పారు. గత పాలనపై ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో చ్రా××జ చైర్మన్ ఎం. రామరాజు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# దోసకాయలపల్లి హాస్టల్ విద్యార్థుల అస్వస్థతపై వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో డి ఎం హెచ్ తక్షణ చర్యలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఆగస్టు 29:**తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామంలోని జి ఎస్ హెచ్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో శుక్రవారం గత రాత్రి హర హర శంభో శంభ కొంతమంది విద్యార్థులకు లూజ్ స్టూల్స్, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించాయి. ఈ ఘటనపై దోసకాయలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సమాచారం అందించిన వెంటనే జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమై, తక్షణమే అవసరమైన వైద్య, పారిశుధ్య, వ్యాధి నియంత్రణ చర్యలు చేపట్టిందనీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. కోమలి తెలిపారు.హాస్టల్‌లో మొత్తం 172 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటివరకు 56 మంది విద్యార్థులకు ఈ లక్షణాలు నమోదయ్యాయన్నారు. బాధిత విద్యార్థులకు దోసకాయలపల్లి పి ఎచ్ సి లో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించా మన్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందనీ తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పి. కోమలి హాస్టల్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించడం జరిగింది. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, తాగునీటి వనరులు, ఆహారం, పారిశుధ్య ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఘటన నేపథ్యంలో నియంత్రణకు అవసరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నియంత్రణ చర్యల్లో భాగంగా హాస్టల్‌లోని నీటి నిల్వ ట్యాంకులు, సంపులను శుభ్రపరచడం, తాగునీటి వ్యవస్థ నుంచి నీటి నమూనాలను సేకరించి డి పి ఎచ్ ఎల్ ల్యాబ్‌కు కల్చర్ పరీక్షల కోసం పంపించామని తెలియ చేశారు. 28 న మిగిలి ఉన్న ఆహారాన్ని పార వేయించామన్నారు. లక్షణాలు ఉన్న విద్యార్థులను ఇతర విద్యార్థుల నుంచి వేరు చేసి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచామన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు హాస్టల్‌లో 24/7 వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక విద్యార్థినికి వేరే అస్వస్థత ఉండటంతో మెరుగైన వైద్య సేవలు అవసరమై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కి రిఫర్ చేయగా, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందన్నారు.

విద్యార్థులు, హాస్టల్ సిబ్బందికి చేతుల పరిశుభ్రత, సురక్షిత తాగునీటి వినియోగం, ఆహార పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పారిశుధ్యంపై ఆరోగ్య అవగాహన నిర్వహించా మన్నారు. హాస్టల్ పరిసరాల్లో అవసరమైన పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, స్థానిక పంచాయతీ సిబ్బంది, ఎం పి డి ఓ తో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలో ఉందని ణవీడనూ డా. పి. కోమలి తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ, ఇతర సమన్వయ శాఖల అధికారులు సిబ్బంది తో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన నివారణ, నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## మహిళా ఖైదీలకు కంప్యూటర్ శిక్షణ, సర్టిఫికెట్లు అందజేత




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 29:** డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఆదేశాల మేరకు ఖైదీలలో నైపుణ్యాభివృద్ధి, పునరావాసాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రత్యేక మహిళా కారాగారం లో మహిళా ఖైదీలకు కంప్యూటర్ శిక్షణా నిర్వహించినట్లు ప్రత్యేక మహిళా కారాగారం పర్యవేక్షణాధికారిణి సి.హెచ్. వసంతకుమారి తెలిపారు. ఈ మేరకు డా. బి.ఆర్. అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అక్కుల మురళిను సంప్రదించి మహిళా ఖైదీలకు కంప్యూటర్ శిక్షణ అందించాలని కోరమన్నారు. అనంతరం వేసవి కాలంలో కళాశాలకు చెందిన నలుగురు మహిళా లెక్చరర్లు కళ్యాణి, బిందు, పావని, శ్రీదేవి లు ప్రత్యేక మహిళా కారాగారానికి వచ్చి మహిళా ఖైదీలకు కంప్యూటర్ లో శిక్షణ అందించినట్లు తెలిపారు.

ఈ శిక్షణలో ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం, ఎంఎస్ ఆఫీస్, పైథాన్, ఇంటర్నెట్, ఈ-మెయిల్, టైపింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు పర్యవేక్షణాధికారిణి వసంత కుమారి తెలిపారు.శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 11 మంది మహిళా ఖైదీలకు ప్రత్యేక మహిళా కారాగారంలో సర్టిఫికెట్లను అందజేసినట్లు సి.హెచ్. వసంతకుమారి తెలిపారు.

కంప్యూటర్ నైపుణ్యాలు మహిళా ఖైదీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, విడుదల అనంతరం ఉపాధి అవకాశాలను మెరుగు పరచి, సమాజంలో పునరావాసం పొందేందుకు దోహదపడతాయని ఆమె తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధితో మహిళా ఖైదీలలో సానుకూల మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. విడుదల అనంతరం ఉపాధి అవకాశాలను పొందేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇందిరా భారతి రాయ్, పి. పావని, కె. సుభాషిణి, బి. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# స్థానికఎన్నికలలో ఎం.పి.పి.జడ్పీటీసీ,ను కైవసంచేసుకోవాలి.



- మండల కన్వీనర్,మాదిరెడ్డిసత్తిబాబు
- వై.సి.పి.పార్టీమండలకమిటీనాయకులు

వి.ఆర్.పురం

**పెన్.పవర్.ఆగస్టు.29:**రంపచోడవరంనియోజకవర్గంమాజీ శాసనసభ్యులు నియోజకవర్గ కోఆర్డినేటర్,నాగులపల్లిధనలక్ష్మి, ఆదేశానుసారం,మండలంలోనిరేఖపల్లిగ్రామంలో శనివారంమాజీ మండలకన్వీనర్,పోడియంగోపాల్, అధ్యక్షతనలోవైస్సార్సీపీ మండల కమిటీ కమిటీ సమావేశంఏర్పాటుచేయడంజరిగింది.ఈసమావేశంలో మండలకన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు,మాజీ సర్పంచ్ పిట్టారామారావు,మాచర్ల గంగయ్య మాట్లాడుతూ స్థానిక ఎన్నికలుఎప్పుడు వచ్చినా వైఎస్ఆర్సిపి,పార్టీ బలపరిచి నఅభ్యర్థులనుఅన్ని స్థానాల్లో గెలుపొంది,ఎంపీపీ జడ్పీటీ సీలను కైవసం చేసుకునే దిశగా కార్యకర్తలు అందరు సమిష్టిగా పనిచేయాలని,మండలనాయకులను కార్య కర్తలనుకోరారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని,నేటికీ ఒక్కకొత్త రేషన్ కార్డు,కొత్త పెన్షన్లు,ఇవ్వలేదని,నిరుద్యోగ భృతి లేదని,మహిళలకు ఇస్తానన్న 1500 ఏమయ్యాయ ని,ఉచితగ్యాస్ లేదని,50 ఏళ్లకే పెన్షన్ అన్నారని,ఇవ్వలే దని,విమర్శించారు.ఈ ప్రాంత పోలవరం నిర్వాసితుల పట్ల,మండలంలో కొంతమంది పాలక పక్ష నాయకులు వ్యవహరిస్తున్న విధానాల పట్ల ప్రజలు తీవ్రమైన వ్యతిరేకతతోఉన్నారని,రానున్న స్థానిక సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలుతగిన,బుద్ధి చెప్పడానికి సిద్ధంగాఉన్నారని,వారన్నారు.ఈ కార్య క్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల జిల్లాఅధ్యక్షులు అధికారప్రతినిదిమండల నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు,వివిధ హోదాల్లో ఉన్న నాయ కులు కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గోకవరం ట్రాఫిక్ - పద్మవ్యూహం కాదు, మృత్యువ్యూహం!

- 75 వేల జనాభాకు నరకం చూపుతున్న అధికారుల నిర్లక్ష్యం
- పార్కింగ్ లేని షాపింగ్ కాంప్లెక్స్ లు, రోడ్డున పడ్డ వ్యాపారాలు, రాజస్థానీల ఆక్రమణలు,
- పట్టించుకోని సంబందింత శాఖలు - అంబులెన్స్ కూడా కదలని దుస్థితి







**గోకవరం పెన్ పవర్ ఆగస్టు 29:-** జిల్లాలో వేగంగా జనాభా పరంగా అభివృద్ధి చెందుతున్న గోకవరం నేడు ట్రాఫిక్ కష్టాలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. 2011 లెక్కల ప్రకారం 69,596 ఉన్న జనాభా, పోలవరం ఆర్ అండ్ ఆర్ కాలనీలతో కలిపి నేడు 75 వేలు దాటింది. జనాభా పెరిగింది, వ్యాపారం పెరిగింది, వాహనాలు పెరిగాయి. కానీ రోడ్డు మాత్రం పెరగలేదు రద్దీ పెరిగింది అధికారుల పర్యవేక్షణ మాత్రం కనీసం పెరగలేదు.గోకవరం ప్రధాన రహదారిలో కొత్తగా కట్టిన ఏ ఒక్క దుకాణ సముదాయానికి రోడ్డే పార్కింగ్ ప్లేస్ అయ్యింది అంటే అతిశయోక్తి కాదు. పార్కింగ్ ప్లేస్ లేదు. నిబంధనల ప్రకారం సెల్లార్ లో పార్కింగ్ చూపించి, తర్వాత దాన్ని కూడా షాపులుగా మార్చి అద్దెకు ఇస్తున్నారు.దీంతో ఆ షాపులకు వచ్చే వంద లాది ద్విచక్ర వాహనాలు, కార్లు అన్నీ రోడ్డు మీదే నిలుపుతున్నారు. ఒక్క వాహనం ఆగితే చాలు, గంటల తరబడి ట్రాఫిక్ జామ్. ఎమర్జెన్సీ అంబులెన్స్ కూడా కదలలేని దయనీయ స్థితి గోకవరం లో ఉన్న ట్రాఫిక్ వల్ల ఏర్పడుతుంది.

విచిత్రం ఏమిటంటే పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలాన్ని కూడా ఆక్రమించుకుంటే పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారంటే ఇది మరి విచిత్రం. ఇక కూడలి సెంటర్ లో అయితే చెప్పనవసరం లేదు. జాతీయ బ్యాంకులకు కూడా పార్కింగ్ లేదు, ఖాతాదారుల వాహనాలు రోడ్డు మీదే పార్కింగ్ చేస్తూ గంటల తరబడి ట్రాఫిక్ కి అంతరాయం.రాజస్థాన్, జైపూర్ ప్రాంతాల నుండి వలస వచ్చిన వ్యాపారులు ఎలక్ట్రికల్, ప్లంబింగ్ షాపులు పెట్టి, పెద్ద పెద్ద పైపులు డ్రమ్ములు,పైపులను ఏకంగా రోడ్డు మీదే పెడు తున్నారు. షాపు ముందు 10 అడుగుల వరకు వారి సామానే. వినియోగదారుడు వాహనం ఎక్కడ పెట్టాలి? షాపుల నిర్వాహకులు ఎలా రోడ్డుపై పెడుతుంటే అధికారులు ఏం చేస్తున్నట్లు అని పలువురు బాహటంగానే అధికారుల తీరిన విమర్శిస్తున్నారు.

### రోడ్డు పక్కన దుకాణాలు, రోడ్డు మీద పశువులు:

పేదలు కుటుంబ పోషణ కోసం రోడ్డు మీద కూర గాయలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడం తప్పు కాదు, కానీ వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపాల్సిన బాధ్యత పంచాయతీది. అది చేయక పోవడంతో రోడ్డు ఇరుకు అవుతోంది. దీనికి తోడు వందల సంఖ్యలో పశువులు రాత్రి పగలు తేడా లేకుండా రోడ్డు మీదే సంచరిస్తున్నాయి. ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది? బహిరంగ వేలం పాటల ద్వారా దుకాణదారుల నుండి సొమ్ములు వసూలు చేసుకుంటున్న పంచాయతీ అధికారులు వినియోగదారులకు కావలసిన కనీస వసతులు కల్పించడంలో మౌనం వహించడం వెనక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


### మృత్యుఘంటికల్లా క్వారీ లారీలు :-

ఏజెన్సీ ప్రాంతం నుండి నల్ల క్వారీ రాళ్లను పెద్ద పెద్ద ట్రక్కుల్లో,ఎటువంటి రక్షణ కవచం లేకుండా, పట్ట పగలు జనావాసాల మధ్య నుండి తీసుకెళ్తున్నారు. ఒక్క రాయి జారి పడితే మనిషి ప్రాణం గాల్లో కలిసినట్లే. నిబంధనల ప్రకారం క్వారీ లారీలు సాయంత్రం 6 గంటల తర్వాతే తిరగాలి. కానీ గోకవరంలో మాత్రం ఈ నిబంధన 100% అతిక్రమణ జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటికి సరైన అనుమతులు ఉన్నాయా? ఓవర్ లోడ్ ఉందా? అని తనిఖీ చేసే నాధుడే లేడు.

### ఎన్ ఎచ్ 516 ఇ పై ఇతర రాష్ట్రాల వాహనాల హడావిడి:

ఇది జాతీయ రహదారి కావడంతో వందల సంఖ్యలో ఇతర రాష్ట్రాల వాహనాలు, ఐ ఏ ఎస్ , ఐ పి ఎస్ అధికారుల వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రోడ్డుపై ట్రాఫిక్ పోలీసు లేదు, సిగ్నల్ లేదు, పార్కింగ్ ప్లేస్ లేదంటే మండల కేంద్రమైన గోకవరంలోని ట్రాఫిక్ ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది అని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పార్కింగ్ లేని కాంప్లెక్స్ లకు వెంటనే నోటీసులు ఇచ్చి సీజ్ చేయాలని రోడ్డు పక్కన ఆక్రమణలను వెంటనే తొలగించాలని రోడ్డు మీద సామాను పెట్టే వ్యాపారు లపై జరిమానా విధించాలి, చిన్న చిన్న వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని,పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని,క్వారీలారీ లను పగటిపూట నిషేధించి, ఓవర్ లోడ్ పై తనిఖీలు చేయాలని కలెక్టర్, ఎస్ పి, ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గోకవరం ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే రేపన్న రోజు పెద్ద ప్రమాదం జరిగితే ఆ ప్రమాదానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది పలువురు గోకవరం ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

# రంగురాళ్ల తవ్వకాలపై నిరంతర నిఘా, తవ్వకాలు సాగిస్తే కఠిన చర్యలు.రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ ...






**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు29:**అడ్డతీగల మండలంలొ తపాసికొండ రిజర్వ్ ఫారెస్ట్ లో రంగు రాళ్ల తవ్వకాలు సాగుతున్నట్లు ఒక్కసారిగా బయటపడింది. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. తపస్సు కొండ తోపాటు మరి ఏ ప్రాంతంలోనైనా రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన తీవ్ర నేరంగా పరిగణించి,కఠిన చర్యలు తీసుకుంటామని అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. అధికారుల కళ్ళుగప్పి రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయని, స్థానికంగా ఒక్కసారిగా వార్తలు గుప్పుమన్నాయి. వెంటనే స్పందించిన అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేసరు ,కొన్నిచోట్ల తవ్వకాలు జరుగుతున్న మాటవాస్తవమేనని, తవ్వకాలకు పాల్పడుతున్న వారి వివరాలను సేకరించే పనిలో తమ సిబ్బంది నిమగ్నమై ఉన్నట్లు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. అంతేకాకుండా తవ్వకాలు సాగుతున్న ప్రాంతంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా, తవ్వకాలకు పాల్పడుతున్న వారిని, వారి వెనక ఉండి ప్రోత్సహించే దళారులను, పక్క ఆధారాలతో కనిపెట్టి కఠిన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని అడ్డతీగల రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ హెచ్చరించారు. గతంలో రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన, ప్రోత్సహించిన వారి వివరాలు సేకరించడమే కాకుండా, వారందరినీ మరో రెండు రోజుల్లో అడ్డతీగల ఫారెస్ట్ కార్యాలయానికి రప్పించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. తవ్వకాలకు పాల్పడిన వారు దొరికితే అటవీ చట్టాల ప్రకారం పలు సెక్షన్లతో కేసులు నమోదు చేస్తామని, ఈ తవ్వకాల వల్ల దెబ్బతిన్న అటవీ సంపదను జరిమానాలు వేసి రికవరీ చేస్తామని రేంజ్ ఆఫీసర్ హెచ్చరించారు. ఇది ఇలా ఉంటే గతంలో పోలీసు రికార్డుల్లో ఉన్న రంగురాళ్ల వ్యాపారస్తులను గుర్తించి ,స్థానిక పోలీసు శాఖ కౌన్సిలింగ్ నిర్వహించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.

# క్రీడలతో విధుల ఒత్తిడికి ఉపశమనం

అధికారుల మధ్య ఉత్సాహభరిత క్రికెట్ పోటీ.. 50 పరుగుల తేడాతో చింతూరు జట్టు విజయం



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 29:** నిత్యం ప్రజా పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అధికారిక విధుల్లో ఒత్తిడితో పనిచేసే అధికారులు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు విధుల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు.జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రంపచోడవరం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఐటీడీఏ చింతూరు, ఐటీడీఏ రంపచోడవరం అధికారుల మధ్య 12 ఓవర్ల క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. రంపచోడవరం జట్టుకు జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఎస్. ప్రశాంత్ కుమార్, డీఎఫ్ఓ శివకుమార్ గంగాల్ తదితరులు ప్రాతినిధ్యం వహించగా, చింతూరు జట్టుకు కలెక్టర్ కె. దినేష్ కుమార్, సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ తదితరులు ప్రాతినిధ్యం వహించారు.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన చింతూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 134 పరుగులు చేసింది. తరుణ్ 59 పరుగులతో రాణించగా, కలెక్టర్ దినేష్ కుమార్ 29 పరుగులు సాధించారు. అనంతరం 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రంపచోడవరం జట్టు 12 ఓవర్లలో 84 పరుగులకే పరిమితమైంది. దీంతో చింతూరు ఐటీడీఏ జట్టు 50 పరుగుల తేడాతో విజయం సాధించింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా అధికారుల మధ్య స్నేహభావం, సమన్వయం, పరస్పర సహకారం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి కె. పోతురాజు, కోచ్ శివాజీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సైకిల్ ఇక తొక్కలేము అంటూ రాజీనామా చేసిన తెలుగు తమ్ముళ్లు...



**జగ్గంపేట నియోజకవర్గంలో టిడిపి పట్టు కోల్పోతుందా...??**

**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 29:-** తెలుగుదేశం పార్టీ నుండి వలసలు ప్రారంభమయ్యాయి. ఇంకా రెండు సంవత్సరాలు అధికారం ఉంది అయినా ఈ పార్టీలో కొనసాగలేమంటూ అప్పుడే వలసలకు క్యూ కట్టారు తెలుగు తమ్ముళ్లు ఇది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉన్న జగ్గంపేట నియోజకవర్గం లో తెలుగు తమ్ముడు వలసలు తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు స్థానిక శాసనసభ్యులు సీనియర్ నాయకులైన జ్యోతుల నెహ్రూ ప్రాతినిధ్య వహిస్తున్న జగ్గంపేట నియోజకవర్గంలో అప్పుడే వలసల ప్రారంభం అవ్వడం తీవ్ర సర్చీనయాసంగా మారింది గత వారం రోజులుగా మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులుగా పనిచేసిన కామరాజుపేట గ్రామానికి చెందిన ఒక నాయకుడు స్వచ్ఛందంగా పార్టీకి పార్టీ సభ్యత్వానికి రాజీనామా ప్రకటించారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అడపా ఫణీంద్ర కిషోర్ మార్గంలో సీనియర్ తెలుగు తమ్ముళ్లు ఒక్కొక్కరుగా రాజీనామాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో కామరాజుపేట తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీలోనే కొనసాగి తెలుగుదేశం పార్టీ గ్రామ రెండవ వార్డ్ ఎంపీటీసీగా 300 పై చిలుకు ఓట్లతో విజయ డంకా మోగించిన నడిమింటి నాగమణి వెంకట్ రమణ, తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. సరైన గుర్తింపు లేదని మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు తన సన్నిహితుల దగ్గర సదర వ్యక్తి వాపోయారు. అదే మండలానికి చెందిన మరి కొంతమంది తెలుగు తమ్ముళ్లు ఈరోజు సైకిల్ దిగిపోయారు తమకు తాముగా పార్టీలో సరైన గుర్తింపు లేదని పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న కనీసం ఎక్కడ ఉన్నారని ప్రశ్నించే వారు లేరని ఇక ఇదే విధానం కొనసాగితే తమ మనుగడై ప్రశ్నార్ధకంగా ఉంటుందని గ్రహించి సైకిల్ దిగిపోదాం అంటూ తన సన్నిహితుల దగ్గర సమావేశమై చర్చించుకుని నిర్ణయం తీసుకునే మూకుమ్మడి రాజీనామాలు ప్రకటించినట్లు తెలుస్తుంది ఈ రాజీనామాలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెదురుపాక గ్రామానికి చెందిన పిల్ల అర్జున సారథి చంటిబాబుకు అంద జేసినట్టు వాళ్ళు తెలిపారు. సైకిల్ దిగిన వారిలో అడపా సత్తిబాబు, అడపా చంద్రమౌళి,బత్తి శ్రీనివాస్,అడపా శేషగిరి, పిర్ల రాజబాబు, నక్క ఏసుబాబు, అడపా ప్రసాద్,మట్ట కామేశ్వరరావు, తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు.

జనసేన గూటికి చేరే అవకాశం :-- ఇదిలా ఉండగా అధికార తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులను సైకిల్ దిగిన తమ్ముళ్లు త్వరలో జనసేన గూటికి చేరి గాజు గ్లాస్ పట్టుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా స్థానిక సంస్థల ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ఇలాంటి వలసలు తెలుగుదేశం పార్టీకి తీవ్ర నష్టం జరగడమే కాకుండా నియోజకవర్గం నాయకత్వాన్ని ప్రశ్నించే విధంగా ఉందని పలువురు తెలుగుదేశం పార్టీ అభిమానులు వాపోతున్నారు

# మారుమూల గిరిజన గ్రామాలకు రహదారుల ఏర్పాటుకు చర్యలు

- అటవీ అనుమతుల కోసం జిల్లా స్థాయి కమిటీలో తీర్మానాలు
- కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,ఆగస్టు 29:**పోలవరం జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేసేందుకు జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీలో తీర్మానాలు చేసి, అవసరమైన అటవీ అనుమతులు మంజూరయ్యేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.శనివారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో డీఎఫ్ఓ శివకుమార్ గంగల్‌తో కలిసి సబ్ డీఎఫ్ఓలు, అటవీశాఖ రేంజ్ అధికారులు, గిరిజన సంక్షేమశాఖ, రోడ్లు భవనాలశాఖ, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీర్లతో జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆకూరు నుంచి బడిగుంట, లోదొడ్డి--కిద్రంగి, కొత్తవీధి--ముళ్లవానివీధి, తంగేడు కోట--సింగన్నకోట, మట్లపాడు, ఎర్రగొండపాకలు--జడ్పీ రోడ్డు, ఉత్తలూరు--భద్రాచలం తదితర రహదారుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై అధికారులతో సమీక్షించారు.

పాపికొండల జాతీయ ఉద్యానవనం పరిధిలో రహదారుల ఏర్పాటుకు సంబంధించి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. చింతూరు--కముజునూరు, వేటుకూరు--శ్రీపురం, ఆకూరు--మామిడివలస, మెత్తవాడ--ఏరువాడ తదితర ప్రాంతాలకు రహదారుల ఏర్పాటుకు అటవీశాఖతో సమన్వయం చేసుకుని అటవీ అనుమతుల కోసం గ్రామసభ తీర్మానాలతో ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

రహదారుల నిర్మాణానికి ఎంత అటవీ భూమి అవసరం, ఎన్ని చెట్లను తొలగించాల్సి ఉంటుందనే వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి మారుమూల గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా జిల్లాలో విద్యుత్ తీగలతో ఉచ్చులు ఏర్పాటు చేసి అడవి జంతువులను వేటాడే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు అటవీశాఖ ద్వారా కేసులు నమోదు చేయాలని సూచించారు. వన్యప్రాణులను వేటగాళ్ల నుంచి రక్షించడం సంబంధిత అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సబ్ డీఎఫ్ఓలు సుబ్బారెడ్డి, రాఘవరావు, ఈఈ ఐ. శ్రీనివాసరావు, ఏడీ మహాకాళేశ్వరరావు, అటవీశాఖ రేంజ్ అధికారులు, డీఈలు గౌతమి, చైతన్య, పి. వెంకటరమణ, భవాని, రమేష్, శివ, సుబ్బారావు, సాలెం రాజు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, ఏఈలు, జేఈలు, ఆర్ఓఎఫ్ఆర్ అధికారి జి. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషా పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- గిడుగు వెంకట రామమూర్తి సేవలు చిరస్మరణీయం
- కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 29:**

తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రంపచోడవరం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి 1863 ఆగస్టు 29న శ్రీకాకుళం జిల్లా ముఖలింగం సమీపంలో జన్మించారని తెలిపారు. పండితులకే పరిమితమైన గ్రాంథిక భాష స్థానంలో సామాన్యులకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషను ప్రోత్సహించేందుకు ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. గిడుగు చేసిన భాషా సంస్కరణల ఫలితంగా విద్య సామాన్యులకు మరింత చేరువైందన్నారు.తెలుగు భాషకు విశిష్టమైన చరిత్ర, సాహిత్య సంపద ఉందని, తెలుగు భాషాభివృద్ధికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేసి, దైనందిన జీవితంలో తెలుగు వినియోగాన్ని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.తెలుగును కేవలం సంభాషణ భాషగా కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి ప్రతీకగా భావించాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషపై అవగాహన పెంచే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తెలుగులో మాట్లాడటం ద్వారా భాషా పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషలో అనేక పాఠ్యపుస్తకాలు, గ్రంథాలు, కథలు, నవలలు, సాహిత్య రచనలు అందుబాటులో ఉన్నాయని, వాల్మీకి రామాయణం వంటి మహత్తర గ్రంథాలు తెలుగు సాహిత్య సంపదకు నిదర్శనమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ శివకుమార్ గంగల్, డీడీఓ వెంకట నారాయణ, ఏపీఓ జనరల్ డీఎన్వీ రమణ, ఈఈ ఐ. శ్రీనివాసరావు, డీఈలు రమేష్, భవాని, చైతన్య, గౌతమి, నాగరాజు, పి. వెంకట రమణ, సబ్ డీఎఫ్ఓలు సుబ్బారెడ్డి, రాఘవరావు, డాక్టర్ నీలిమ, ఏఓ వై. రాజు, ఐటీడీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



**నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి**

**కలెక్టర్ కె. దినేష్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 29:**పోలవరం జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శనివారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారులు, వంతెనలు, తాగునీరు, భవనాలు, విద్యుత్, విద్య, వైద్యం, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు తదితర మౌలిక వసతుల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, తాగునీటి వసతులు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో అవసరమైన సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మంజూరైన మెటల్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.నరేగా ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. మంజూరైన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయని కాంట్రాక్టర్లపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఒక్కో ఇంజనీరింగ్ శాఖకు మంజూరైన పనులను పూర్తి చేసేందుకు అదనంగా అవసరమైన నిధుల వివరాలతో నివేదికలు సమర్పించాలని సూచించారు.అంగన్వాడీ భవనాలు, మరుగుదొడ్లు, ఈఆర్ఎంఎస్ క్వార్టర్లు, సున్నంపాడు--నూరుపూడి రహదారి పనుల పురోగతిపై కలెక్టర్ అధికారులను ఆరా తీశారు.గ్రామపంచాయతీ భవనాలు, ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. రబ్బర్ ప్రాసెసింగ్ స్మోకింగ్ రూముల ఏర్పాటు, పీఎం జన్మన్ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులపై కూడా సమీక్షించారు.పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన గృహాల సంఖ్య, ఇప్పటివరకు పూర్తయిన గృహాలు, ఇంకా నిర్మించాల్సిన గృహాల వివరాలను సమర్పించాలని తెలిపారు. కొత్తగా మంజూరైన గృహాలకు భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.100 కోట్ల అదనపు నిధులు మంజూరు చేయించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ నరసింగారావు, ఈఈ ఐ. శ్రీనివాసరావు, ఏపీఈపీడీసీఎల్ ఏడీ మహంకాళేశ్వరరావు, డీఈలు గౌతమి, భవాని, చైతన్య, పి. వెంకటరమణ, రమేష్, సాలెం రాజ్, నాగరాజు, రామచంద్రమూర్తి, సుబ్బారావు, శివ, జేఈఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# రూ 3.52 కోట్లతో సీ.సీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 29:**రూరల్ మండలంలో కోలమూరు, కొంతమూరు, రాయుడుపాకల గ్రామాల్లో కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రగతిని ప్రజలకు తెలియజేయాలన్నారు. పుష్కరాల నాటికి అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే గోరంట్ల చేస్తామన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో రూరల్ నియోజకవర్గం దూసుకుపోతుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రూరల్ మండలం కోలమూరు పంచాయతీ అఫీషియల్ కాలనీ లో రూ.1.52 కోట్ల రూపాయలతో సీ.సీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు శంకుస్థాపన ప్రకాశం ఎంప్లాయిస్ కాలనీ (సొసైటీ వద్ద) 2కోట్ల రూపాయలతో సి.సి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఈరోజు 3.52 కోట్ల రూపాయలతో సి.సి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు శంకుస్థాపన చేశామని, కొంతమూరు, కోలమూరు, రాయుడుపాకల ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, గ్రామంలో చాలావరకు పనులు పూర్తి చేశామని, రాబోయే పుష్కరాలు నాటికి కొంతమూరు, కాతేరు రోడ్డును సెంటర్ లైటింగ్ తో రోడ్డును వెడల్పు చేసి డబల్ రోడ్డు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. బూత్ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ప్రతి ఒక్కరూ పాల్గొని డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం "రెండేళ్ల నమ్మకంఅభివృద్ధి–సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ విజయాలను తెలియజేస్తూ, ప్రజల వద్ద నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఈకార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పిన్నమరెడ్డి ఈశ్వరుడు, రాష్ట్ర వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు వాసిరెడ్డి రాంబాబు, యమన నారాయణ గౌడ్, కర్రీ అప్పలస్వామి, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు ఉండవల్లి బంగారాజు, సొసైటీ అధ్యక్షులు అడ్డాల శ్రీను, తాడేపల్లి నాగరాజు, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, పి.ఆర్ డి.ఈ రామకృష్ణ, ఏ.ఈ సంపత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, దండమూడి శ్రీహరి, సయ్యద్ ఉమర్, షేక్ కాసిమ్, సలీమ్, గోకా శ్రీను, పాలడుగులు శ్రీనివాస్, కోమలి శ్రీను, వడ్డి రామక్రిష్ణ, బత్తిన కొండబాబు, తాటిపాక వెంకటేశ్వరరావు, వీరబాబు, అడ్డాల పెద్దశ్రీను , వేమగిరి రాజు, సుదీర్ , అంగర రాజు, బెసే నటరాజ్, అల్లాడ వెంకటేశ్వరరావు, మల్లెమొగ్గల సత్యనారాయణ, కాసులమ్మ, సుల్తాన, బొప్పన లక్ష్మి, కొల్లి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి



- యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 29:**యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన లి'మా ఊరి--మా క్రీడా మైదానం'లిను శనివారం కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ముందుగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కలెక్టర్ అనంతరం క్రీడా జెండాను ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తోందన్నారు. ధ్యాన్ చంద్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.పోలవరం జిల్లాలో 50 క్రీడా మైదానాలను గుర్తించామని, వాటిని 45 రోజుల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఐ.పోలవరం గ్రామస్థులు స్వచ్ఛందంగా శ్రమదానం చేసి మైదానం అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ఈ మైదానంలో 11 రకాల క్రీడలు నిర్వహించుకునేలా రూ.4 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.మైదానం నిర్వహణ బాధ్యతను గ్రామస్థులే తీసుకుని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. జిల్లాలోని యువతలో వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడలపై ఆసక్తిని ప్రోత్సహిస్తామని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తామన్నారు.

జిల్లాలో బహుళ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో జాతీయ స్థాయిలో క్రీడాకారులు పాల్గొనేలా క్రీడాభివృద్ధికి సుమారు రూ.40 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గుర్తించిన 50 క్రీడా మైదానాల్లో క్రీడా పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మండలంలో నాలుగు క్రీడా మైదానాలను గుర్తించామని, వాటిని క్రీడా కార్యక్రమాలతో కళకళలాడేలా చేయాలని సూచించారు.పోలవరం జిల్లాలోని యువతీ యువకులు 'మా ఊరి--మా క్రీడా మైదానాలను' సద్వినియోగం చేసుకుని వివిధ క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి క్రికెట్ బ్యాటింగ్, వాలీబాల్ ఆడారు.ఈ కార్యక్రమంలో క్రీడల డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వి. రమణ, తహసీల్దార్ సిహెచ్. బాలాజీ, ఐసీడీఎస్ పీడీ కె. ఉమా, ఎంపీపీ బంధం శ్రీదేవి, ఎంపీడీవోలు ప్రసాద్, సాల్మన్ రాజ్, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, మాజీ సర్పంచులు వెంకటలక్ష్మి, శాంతకుమారి, మాజీ ఎంపీటీసీ



మనోహర్, ఫిజికల్ డైరెక్టర్లు వి. కృష్ణారావు, కంగల పోతురాజు, ధర్మరాజు, కె. బాపిరాజు, జి. చిన్నారావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. నిర్మల, వీఆర్వో సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# తెలుగు భాష దినోత్సవం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 29;** తెలుగును గ్రాంథిక పదాల నుంచి పామరులు మాట్లాడుకునే వ్యవహారిక భాషగా తీర్చిదిద్దిన తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి చిరాస్మరణీయులని వాల్మీకి విజ్ఞాన కేంద్రం ప్రధాన ఉపాధ్యాయులు ఎం వి ఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం వంకావారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి 164 వ జయంతిని తెలుగు భాష దినోత్సవం గా ప్రకటించడం జరిగిందని అన్నారు. 1936 సంవత్సరంలో ఒలింపిక్స్ విజేత హాకీ దిగ్గజం ధ్యానాచంద్ జయంతి ని జాతీయ క్రీడ దినోత్సవం గా ఉండటం హర్షించదగ్గ విషయమని అన్నారు. ధ్యాన చెందకి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాలని విద్యార్థులకు క్రీడలు పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థులు తెలుగు అక్షరం వలె విన్యాసం చేసి పలువురును ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేదుల జనార్ధన రావు, శివశంకర్, వెంకటేశ్వరరావు, మోహన్, మహేష్, గౌరీ శ్రీ ,అమల తదితరులు పాల్గొన్నారు.

# ఆటో ను ఢీకొన్న స్కూల్ బస్సు ముగ్గురికి తీవ్ర గాయాలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 29:**స్థానిక పోలీస్ క్వాటర్స్ ప్రాంతంలో స్కూల్ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమాచారం తెలియగానే బొమ్మూరు పోలీసులు స్పందించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు 108కు సమాచారం అందించారు. అయితే 108 రావడానికి ఆలస్యం అవుతుందని తెలియడంతో పోలీసులే ఒక ఆటో లో గాయపడిన ముగ్గురిని తరలించారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ప్రభుత్వ ఆసుపత్రి లో క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కండవల్లి లక్ష్మి పరిస్థితిని క్షతగాత్రుల వద్దకు చేరుకుని, వారికి తక్షణ వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టారు.

కేసు నమోదు చేసి బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తెలుగు భాషను భావి తరాలకు అందించాలి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 29:**స్థానిక రాజమహేంద్రి మహిళ డిగ్రీ పీజీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని గిడుగు వెంకట రామ్మూర్తి గారి విగ్రహానికి కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ముందుగా కళాశాల డైరెక్టర్ శ్రీమతి. తేతలి సత్య సౌందర్య మాట్లాడుతూ తెలుగు భాషకు విశిష్టమైన చరిత్ర, సుసంపన్నమైన సాహిత్య సంపద, ప్రత్యేకమైన సంస్కృతి ఉన్నాయని తెలుగు భాష అభివృద్ధికి కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వ్యవహారిక భాషను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో తెలుగు భాష వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని, విద్య, పరిపాలన, సాంకేతిక రంగాల్లో తెలుగు భాషకు తగిన ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. పిల్లలు, యువత తెలుగు చదవడం, రాయడం, మాట్లాడడం పట్ల ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థు లకు చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.కే.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ

తెలుగు భాషను కేవలం ఒక భాషగా కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించి ప్రతి ఒక్కరూ దాని పరిరక్షణకు కృషి చేయాలని వక్తలు కోరారు."దేశ భాషలందు తెలుగు లెస్స" అనే కీర్తిని నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా తెలుగు భాషను ప్రేమించి, ప్రోత్సహించాలని ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎం.పీ.సీ చదువుతున్న బి. సత్య ప్రసన్న మొదటి బహుమతిని పద్య రచనల పోటీల్లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న బి జాహ్నవి మొదటి బహుమతిని గెలుచు కున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమ తులు ప్రధానం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు అయిన వీరలక్ష్మి ,సుబ్బలక్ష్మి, మరియు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**చిన్న కథల పోటీల్లో విద్యార్థుల సృజనాత్మక ప్రతిభ**

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 29:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష, సాహిత్యం, సృజనాత్మకతపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ సందర్భంగా చిన్న కథల పోటీలు నిర్వహించారు.

పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మక ప్రతిభను చాటుకున్నారు. వివిధ అంశాలపై ఆసక్తికరమైన కథలను రచించి, తెలుగు భాషపై తమకున్న అభిమానం, సాహిత్య అభిరుచిని ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి, విద్యార్థి కార్యకలాపాల డీన్ డాక్టర్ డి. కిషోర్ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తెలుగు భాష గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, మాతృభాషపై మమకారాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా తెలుగు భాష, సాహిత్యానికి సంబంధించిన మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ప్రధాన గ్రంథాలయ అధికారి కె. అశోక్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, సుజాత, వెంకటరమణ, భూదేవి, స్వామి, రామచంద్రారెడ్డి, రమ్య, వి. లక్ష్మి రమ్యతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన వారి ఓట్ల తొలగింపులో రాజకీయ పార్టీలు సహకరించాలి-ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న



**పెన్ పవర్ -- ఉంగుటూరు, ఆగష్టు 29**

సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు బూత్ లెవెల్ అధికారులకు సహకరించాలని ఏలూరు ఆర్డీవో, ఉంగుటూరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారిణి లక్ష్మీ ప్రసన్న కోరారు. శనివారం సాయంత్రం ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించలేదని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మరణించిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత లేని పేర్లను జాబితా నుంచి తొలగించే ప్రక్రియలో బీఎల్ఓలకు రాజకీయ పార్టీ ప్రతినిధులు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

ఈ సమావేశంలో వైకాపా, తెదేపా, జనసేన, సీపీఎం, భాజపా తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. తహశీల్దారు మాద్రపు సన్యాసిరావు, ఎన్నికల డీటీ సంధ్యారాణి పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పుష్కరాల్లో గోదావరి జిల్లాల కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి




ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ ప్రజానాట్యమండలి ప్రదర్శన


**రాజమహేంద్రవరం పెన్ పవర్ ఆగస్టు 29:**రానున్న గోదావరి పుష్కరాల్లో ఉభయగోదావరి జిల్లాలకు చెందిన కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రజ నాట్య మండలి, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా ప్రభుత్వాన్ని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద జానపద కళాకారులు ఆట పాట మాట నినాదంతో కళ ప్రదర్శన నిర్వహించారు. ప్రధానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్ చంద్ర నాయక్ మాట్లాడుతూ గ్రామీణ, జానపద కళాకారులు మనుగడ నానాటికి తీసికట్టుగా మారిందని ప్రభుత్వం నుంచి ప్రజల నుంచి ప్రోత్సాహం కరువైందన్నారు గతంలో ప్రభుత్వ కార్యక్రమాలకు కళాకారుల చైతన్యవంతమైన వేదికలుగా ఉపయోగించుకునే వారన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవోను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్ లు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రదేశ్ బడ్జెట్లో సాంస్కృతిక శాఖకు ప్రతి ఏటా 500 కోట్లు నిధులు కేటాయించాలని, 50 సంవత్సరాలు నిండిన పేద కళాకారులకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్లో సాంస్కృతిక సారథి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కళాకారులకు వేతనంతో కళా ప్రదర్శనలకు అవకాశాలు కల్పించాలని, నంది నాటక ఉత్సవాల్లో గ్రామీణ, జానపద కళారూపాల విభాగాల్లో పోటీలు చేర్చాలని, పేద కళాకారులకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని, జానపద, గ్రామీణ కళాకారులకు కళా రత్న ఉగాది పురస్కారాలు ఎంపిక చేయాలని, ప్రతి జిల్లా కేంద్రంలో కళాక్షేత్రాన్ని నిర్మించాలని, కళాకారులకు బస్సు, రైలు ప్రయాణ ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరనాల రాజకుమార్ ,కే పోతురాజు , నాగబాబు, ఉమామహేశ్వరి, రాంబాబు, వి కృష్ణ ,జి శేషగిరి , శామ్యూల్ మహంతి లక్ష్మణరావు, నడగల రమణ, ఈ పిచ్చయ్య, సిపిఐ రమణ, నల్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.15.18 లక్షలతో 11వ డివిజన్ లో విస్తరణ పనులకు శంఖుస్థాపన




**రాజమహేంద్రవరం , పెన్, పవర్, ఆగస్టు 29:** నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, తాగునీటి సౌకర్యాలు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. 11వ డివిజన్ పరిధిలో రూ.15,18,000 వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శనివారం శంఖుస్థాపన చేశారు. ఆర్‌సీసీ కల్వర్టు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులతో పాటు కల్వర్టు నిర్మాణం, రోడ్డు వెడల్పు పనులకు ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో మౌలిక వసతుల సమస్యలతో ఇబ్బందులు పడిన ప్రాంతాలకు ప్రస్తుతం ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నగరానికి తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు అమృత్ 2.0 పథకం కింద భారీ ప్రాజెక్టులకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, వీధి దీపాలు, పారిశుధ్యం, పార్కులు, చెరువుల అభివృద్ధి వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ తో ప్రజాసమస్యల పరిష్కారం



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 29 :** ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేట రావులమ్మ నగర్ లోని క్యాంప్ ఆఫీసులో శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు పెన్షన్లు, హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామానికి చెందిన నక్క బాలకృష్ణ కుమార్తె నక్క పూర్ణ అనుదీప్తికి గుండెకు రంధ్రం కావడంతో ఓపెన్ హార్ట్ సర్జరీకి ఎల్ఓసి 3,92,000 అందించేందుకు, గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన మండపాక రాజులమ్మకు బ్రెయిన్ ట్యూమర్ రావడంతో 3,72,000 ఎల్ ఓ సి అందించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పంపించడం జరిగింది. కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మిగిలిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, పాఠం శెట్టి కొండరాజులు, జనసేన నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సింగలూరి రామ్ దీపు తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాషను మరవొద్దు.. తెలుగును బతికించుకుందాం!

**గిడుగు ఆశయాలను కొనసాగించాలి.. తెలుగు భాషా దినోత్సవంలో శ్రీనికేతన్ పాఠశాల నిర్వాహకుల పిలుపు**



**పిఠాపురం రూరల్, పెన్ పవర్, ఆగస్టు 29:** ఆంగ్ల భాషా వ్యామోహంలో మాతృభాష తెలుగు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్ తరాలు తెలుగు మాట్లాడటానికే దూరమయ్యే ప్రమాదం ఉందని శ్రీనికేతన్ పాఠశాల కరస్పాండెంట్ వెంకట రామ్మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషను సామాన్య ప్రజలకు చేరువ చేసి, వ్యవహారిక భాషకు పట్టం కట్టిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

పిఠాపురం రూరల్‌లోని శ్రీనికేతన్ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకట రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ.. గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషను ప్రజల నిత్య వ్యవహారంలోకి తీసుకురావడానికి, సామాన్యులకు సులభంగా అర్థమయ్యే వ్యవహారిక భాషను ప్రోత్సహించడానికి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు క్లిష్టమైన భాషలో కాకుండా సులభంగా అర్థమయ్యే మాతృభాషలో విద్య అందించాలనే ఆలోచనను ఆయన బలంగా ముందుకు తీసుకెళ్లారని గుర్తుచేశారు.

ప్రస్తుత విద్యా వ్యవస్థలో మాతృభాషకు మరింత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో చదవడం, రాయడం, మాట్లాడటం వంటి భాషా నైపుణ్యాలను పెంపొందించేలా ప్రభుత్వం, విద్యాసంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

"తెలుగు మన మాతృభాష.. దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత" అని పేర్కొంటూ గిడుగు రామమూర్తి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు, యువత తెలుగు భాష అభివృద్ధికి కృషి చేయాలని వెంకట రామ్మోహనరావు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, బోధనా సిబ్బంది పాల్గొని తెలుగు భాషపై తమ అభిమానం చాటుకున్నారు.

## ఇతరులతో పోల్చుకోవద్దు.. సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు: సూర్యకుమార్ యాదవ్

- యువ క్రికెటర్లు ఇతరులతో పోల్చుకోవద్దన్న సూర్యకుమార్
- వయసుతో పనిలేదు, సన్నద్ధతే ప్రధానమని స్పష్టీకరణ
- పరుగులు చేస్తూ ఉంటే సెలక్టర్లే వెతుక్కుంటూ వస్తారని భరోసా
- దేశవాళీ క్రికెట్‌లో తాను పడిన కష్టాలను గుర్తు చేసుకున్న స్టార్ బ్యాటర్
- ఎవరూ చూడనప్పుడు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ క్రికెటర్లకు భారత మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక సందేశం ఇచ్చాడు. ఓపిక కోల్పోకుండా పరుగులు చేస్తూ ఉండాలని, తమ సన్నద్ధతపై నమ్మకం ఉంచాలని సూచించాడు. నిలకడగా రాణిస్తే సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారని, మీ బ్యాటే అన్నింటికీ సమాధానం చెబుతుందని భరోసా ఇచ్చాడు. ఎన్నో ఏళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో శ్రమించి, ఆలస్యంగా భారత జట్టులోకి వచ్చి అగ్రశ్రేణి బ్యాటర్‌గా ఎదిగిన తన అనుభవాన్ని సూర్య యువతతో పంచుకున్నాడు.

ఒక యువ క్రికెటర్ ప్రయాణంలో ఓపిక ఎంత ముఖ్యమో వివరిస్తూ, 'ఐఏఎన్ఎస్'తో సూర్యకుమార్ మాట్లాడాడు. "ప్రతి ఒక్కరి కథ వేరు, ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నం. అందుకే యువ క్రికెటర్లు ఇతరులతో తమను తాము పోల్చుకోవద్దని నేను చెబుతాను. నేను కూడా ఏళ్ల తరబడి ఏజ్-గ్రూప్, దేశవాళీ క్రికెట్ ఆడాను. కిట్ బ్యాగ్‌తో బస్సులు, రైళ్లలో ఎన్నో ప్రయాణాలు చేశాను. నా అవకాశం కోసం ఓపికగా ఎదురుచూశాను" అని తెలిపాడు.

భారత క్రికెట్‌లో యువ ఆటగాళ్లపై ఉండే తీవ్రమైన ఒత్తిడిని సూర్యకుమార్ ప్రస్తావించాడు. "మన దేశంలో 21 లేదా 25 ఏళ్లకల్లా జట్టులో చోటు దక్కకపోతే కెరీర్ ముగిసిపోయినట్లేనని, మరో మార్గం చూసుకోవాలని చాలామంది భావిస్తారు. కానీ,

నా దృష్టిలో వయసు అనేది గడువు కాదు, మీ సన్నద్ధతే అసలైన గడువు" అని పేర్కొన్నాడు. ఎవరూ గమనించనప్పుడు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టాలని, కఠోర సాధనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపవద్దని సూచించాడు.

సెలక్టర్ల దృష్టిని ఆకర్షించడానికి ప్రదర్శనలే అత్యంత శక్తిమంతమైన మార్గమని సూర్యకుమార్ అభిప్రాయపడ్డాడు. "క్రికెట్ పరంగా చెప్పాలంటే, మీరు పరుగులు చేస్తూ ఉంటే, మీ బ్యాటే సమాధానం

చెబుతుంది. సెలక్టర్లు కచ్చితంగా మిమ్మల్ని గుర్తిస్తారు. మీరు ఉండాల్సిన సరైన స్థానానికి చేరుకుంటారు" అని భరోసా ఇచ్చాడు. తోటి ఆటగాళ్లతో పోల్చుకుని ఆందోళన చెందే యువతకు సూర్యకుమార్ మాటలు స్ఫూర్తినిస్తున్నాయి. కలకు గడువు తేదీ ఉండదని, నిబద్ధతతో సిద్ధమైతే విజయం తప్పక వరిస్తుందని సూర్య తన కెరీర్ ద్వారా నిరూపించాడు.

## గ్రౌండ్‌లోనే కాదు.. బ్రాండ్ మార్కెట్‌లోనూ మన స్టార్లదే హవా: ఫోర్బ్స్ ఇండియా 2026 రిపోర్ట్!






**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో క్రికెట్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదు.. కోట్ల మంది ఆరాధించే ఒక అతిపెద్ద పండుగ.. టీమిండియా స్టార్ ప్లేయర్లు మైదానంలోకి దిగితే రికార్డులు బ్రేక్ అవుతాయి, అదే వాణిజ్య ప్రపంచంలోకి అడుగుపెడితే బిజినెస్ డీల్స్ దుమ్మురేపుతాయి. ప్రపంచంలోనే ఏ క్రీడాకారులకూ లేనంతటి ఫ్యాన్ బేస్, మార్కెట్ పొటెన్షియల్ భారత క్రికెటర్ల సొంతం. తమ ఆటతీరుతో పాటు మైండ్ బ్లాకింగ్ పర్సనాలిటీ, సోషల్ మీడియా ఇంపాక్ట్‌తో స్టేడియం సరిహద్దులు దాటి కార్పొరేట్ రంగాన్ని ఏలుతున్నారు. ఆటకు వీడ్కోలు పలికినా సరే, వీరి బ్రాండ్ వ్యాల్యూ కొద్దిగా కూడా తగ్గకపోవడం వీరికున్న భారీ క్రేజ్‌కు అద్దం పడుతోంది. తాజాగా ప్రముఖ వ్యాపార పత్రిక వెల్లడించిన ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 (ఖీశీతీఎవం ×అసఋు ాష్ట్రశీఒర్శీజూజూవతీం 2026) అత్యంత విలువైన సెలబ్రిటీల జాబితాలో ఇండియన్ క్రికెటర్లు తమ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. సినిమా, సంగీతం, క్రీడలు.. ఇలా దేశంలోని అన్ని రంగాల బిగ్ సెలబ్రిటీలను దాటుకుని కింగ్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ (రూ.3,017 కోట్లు), గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా (రూ.2,507 కోట్లు)లను వెనక్కి నెట్టి కోహ్లీ నంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. టీ20, టెస్టుల నుంచి తప్పుకున్నా కోహ్లీకున్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. బ్రాండ్ విలువ: ఏకంగా రూ.3,542 కోట్లు

**రెండో స్థానంలో కెప్టెన్ కూల్ ధోనీ:**
భారత జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఈ జాబితాలో రెండో భారత క్రికెటర్‌గా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ సుమారు రూ.2,141 కోట్లు. మహీ భాయ్ క్రికెట్‌కు దూరమైనప్పటికీ ధోనీకి ఉన్న అభిమానగణం, వ్యాపార కార్యకలాపాలు, ప్రకటనల ఒప్పందాలు అతడి బ్రాండ్ విలువను భారీగా నిలబెట్టాయి. మొత్తం భారత సెలబ్రిటీల జాబితాలో ధోనీ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

**దక్షిణాసియాసంస్కృతి తెలుసుకోవడం**

**మూడో స్థానంలో మాస్టర్ సచిన్:**
క్రికెట్ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కూడా ఈ ఫోర్బ్స్ జాబితాలో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సచిన్ బ్రాండ్ విలువ రూ.1,676 కోట్లుగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్ అయి ఎన్నో సంవత్సరాలు గడిచినా.. సచిన్ బ్రాండ్ ప్రభావం మాత్రం కొనసాగుతుంది. మొత్తం సెలబ్రిటీల లిస్టులో ఆయన 8వ స్థానంలో నిలిచాడు.

**నాలుగో స్థానంలో బుమ్రా:**
ఇక భారత క్రికెటర్లలో జస్‌ప్రీత్ బుమ్రా ఈ జాబితాలో అత్యంత బ్యాండ్ వ్యాల్యూ కలిగిన వారిలో ఒకడిగా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,142 కోట్లుగా నమోదు అయింది. ఫోర్బ్స్ జాబితాలో బుమ్రా మొత్తం 16వ స్థానంలో నిలిచాడు. మైదానంలో భారత పేస్ దళానికి నాయకుడిగా ఎదిగిన బుమ్రా.. వాణిజ్యంగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు.

**ఐదో స్థానంలో రోహిత్ శర్మ:**
భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ క్రికెటర్ల జాబితాలో ఐదో స్థానాన్ని దక్కించుకున్నాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,055 కోట్లు అని చెప్పాలి.. మొత్తం సెలబ్రిటీల జాబితాలో రోహిత్ 18వ స్థానంలో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి విజయాలు, అభిమానుల్లో ఉన్న ఆదరణ, వాణిజ్య ఒప్పందాలు బ్రాండ్ విలువను పెంచడంలో కీలకంగా మారాయి.

ఫోర్బ్స్ ఇండియా 2026 టాప్--5 జాబితాలో చోటు దక్కించుకున్న ఈ ఐదుగురు భారత క్రికెటర్ల మొత్తం బ్రాండ్ విలువ కలిపితే ఏకంగా రూ.9,556 కోట్లు కావడం విశేషం. గ్రౌండ్‌లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలతో పాటు మైదానం బయట వారికున్న లీడర్‌షిప్ క్వాలిటీస్, సోషల్ ఇమేజ్ ఇండియన్ ఆటగాళ్లను గ్లోబల్ మార్కెట్‌లో తిరుగులేని బ్రాండ్‌లుగా నిలబెడుతున్నాయి.

## ఆసియా క్రీడలకు నీరజ్ చోప్రా దూరం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు."ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది" అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

# దీపిక మాటలు కాదు.. చేతల్లో చూపించాలి







తాను ప్రభాస్ కంటే ఎక్కువ సినిమాలు చేశానని.. తన కంటే ఎక్కువ సక్సెస్ ఫుల్ అన్నట్లుగా దీపికా పదుకొనే ఇటీవల ఒక కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపుతున్నాయి. వేరే హీరో అంటే ఏమో కానీ.. దేశవ్యాప్తంగా తిరుగులేని అభిమానాన్ని సంపాదించుకుని ఇండియాలో బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా అవతరించిన ప్రభాస్‌ను.. వివాదాలకు దూరంగా ఉంటూ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే హీరో మీద పరోక్షంగా తన అక్కసు వెళ్లగక్కడం.. తనతో పోటీ పెట్టుకుని మాట్లాడ్డం.. అతణ్ని కించపరిచేలా మాట్లాడ్డం తెలుగు వాళ్లకే కాదు.. ఇతర భాషల వాళ్లకు కూడా నచ్చట్లేదు. ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేసే దీపికకు ముందు నుంచే సోషల్ మీడియాలో హేటర్స్ ఎక్కువ. తాజా వ్యాఖ్యలతో ఆమె మీద వ్యతిరేకత మరింత పెరిగిపోతోంది. దీపిక పాస్ట్ ఎఫైర్ల దగ్గర్నుంచి.. వివిధ సందర్భాల్లో ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోల వరకు తీసుకొచ్చి ఆమెను ట్రోల్ చేస్తున్నారు. ఇదంతా పక్కన పెడితే.. ప్రభాస్ కంటే తాను పెద్ద స్టార్ అన్నట్లు చెప్పుకుంటూ తనకు దీటుగా పారితోషకం డిమాండ్ చేస్తున్న దీపికకు నెటిజన్లు ఒక సలహా ఇస్తున్నారు. నిజంగా దీపిక అంత పెద్ద స్టార్, తనకు భారీ మార్కెట్ ఉందని నమ్ముతున్నట్లయితే.. మేల్ సూపర్ స్టార్లతో కలిసి చేసే సినిమాల్లో వారితో పోటీ పెట్టుకునే బదులు ఒక లేడీ ఓరియెంటెడ్ మూవీ చేసి తన బాక్సాఫీస్ స్టామినా ఎంతో రుజువు చేయాలని అంటున్నారు. తనే లీడ్ రోల్ చేసిన సినిమాతో తాను ఎన్ని వందల కోట్లు రాబట్టగలదో చూపిస్తే.. ఆమె ఫాలోయింగ్, మార్కెట్ ఎంత అన్నది అందరికీ అర్థమవుతుంది కదా అని అభిప్రాయపడుతున్నారు. చివరగా దీపిక నటించిన లేడీ ఓరియెంటెడ్ మూవీ 'చప్పక్' అయితే రూ.5' కోట్లకు అటు ఇటుగా వసూళ్లు రాబట్టింది. అది 2020లో రిలీజైన సినిమా. పైగా అదొక ప్రయోగాత్మక చిత్రం. ఇప్పటికి దీపిక మార్కెట్ ఇంకా పెరిగి ఉంటుంది కాబట్టి.. ఇప్పుడు ఒక యాక్షన్ టచ్ ఉన్న లేడీ ఓరియెంటెడ్ సినిమా చేసి దీపిక తన స్టామినా ఏంటో చూపించాలి. ఆ సినిమా ప్రభాస్ చిత్రాల్లాగే వందలు, వేల కోట్ల వసూళ్లు రాబడితే.. అందుకు తగ్గట్లే పారితోషకం కోసం డిమాండ్ చేయొచ్చు. ప్రభాస్ కంటే తానే పెద్ద స్టార్, సక్సెస్ ఫుల్ అని బల్లగుద్ది చెప్పొచ్చు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965